ప్రజాశక్తి

సోమవారం 19 జూన్ 2023

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

పెంచిన కరెంటు ఛార్జీలు రద్దుచేయాలి

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : రాష్ట్ర ప్రభుత్వం భారీగా పెంచిన విద్యుత్ ఛార్జీలు, స్మార్ట్ మీటర్లు పెట్టే యోచనను రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం జిల్లా వ్యాప్తంగా అన్ని సబ్‌స్టేషన్లు, విద్యుత్ కార్యాలయాల వద్ద నిరసనలు తలపెట్టినట్లు సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమానికి కొనసాగింపుగా నివాస ప్రాంతాల్లోను నిరసనలు జరుగుతాయని పేర్కొన్నారు. ప్రజల పెద్దఎత్తున ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం రద్దు చేసుకునే వరకూ ప్రతిఘటించాలని కోరారు. రాష్ట్రంలోని

నేటి నిరసనలను జయప్రదం చేయాలి

సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు

వైసిపి ప్రభుత్వం గత ఏడాది కరెంటు ఛార్జీలు పెంచి రూ.1400 కోట్లు భారాలు ప్రజలపై మోపిందని, స్లాబులు మార్చేసిందని తెలిపారు. ఇప్పుడు సర్దుబాటు ఛార్జీలు పేరుతో రూ.6 వేల కోట్ల భారాలు వేసిందని వివరించారు. గతంలో వాడిన కరెంటుకు సర్దుబాటు ఛార్జీలు పేరుతో ఇప్పుడు వసూలు చేస్తున్నారని తెలిపారు. 2014లో వాడిన కరెంటు ప్రతి యూనిట్‌కు రూ.20 పైసలు, 2021 మేలో వాడిన కరెంటుకు యూనిట్‌కు రూ.20 పైసలు, 2023 ఏప్రిల్‌లో వాడిన కరెంటుకు యూనిట్‌కు మరో రూ.40 పైసలు వేసి ప్రతి యూనిట్‌కు 80 పైసలు చొప్పున అదనపు భారం వేసారని వివరించారు. కరెంటు ఛార్జీలతో పాటు ఫిక్స్‌డ్ ఛార్జీలు, కస్టమర్ ఛార్జీలు, సర్ ఛార్జీలు, విద్యుత్ సుంకం, సర్దుబాటు ఛార్జీలు పేరుతో ప్రజలను దొంగ దెబ్బతీస్తోందని

మిగతా 2లో..

సర్దుబాటు పేరుతో భారాలు తగవు : సిఐటియు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : సర్దుబాటు పేరుతో విద్యుత్ ఛార్జీలు భారాలు తక్షణమే రద్దుచేయాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శివాజీపాలెంలోని సవేరా ఫంక్షన్ హాల్‌లో ఆదివారం సిఐటియు కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ తీసుకొచ్చిన విద్యుత్ సంస్కరణలను రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అమలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తెలుగుదేశం ప్రభుత్వం ప్రజలపై భారాలు మోపుతోందని, వైసిపి అధికారంలోకి వస్తే ప్రజలపై భారాలు వేయబోమని హామీ ఇచ్చి, నేడు ఆ హామీని విస్మరించారని విమర్శించారు. సర్దుబాటు, ఫిక్స్‌డ్, ట్రూఅప్ ఛార్జీలపేరుతో 94 శాతం పెంచడం సరైందికాదన్నారు. ఇది చాలదన్నట్లు 2014 నుంచి 2021 వరకు వాడిన కరెంటుకు యూనిట్‌కు 20 పైసలు నుంచి 80 పైసలు వరకు పెంచడం దుర్మార్గం అన్నారు. విద్యుత్‌ను ప్రైవేట్‌పరం చేయడంతో ఉత్పత్తి నుండి పంపిణీ వరకు అయ్యే ఖర్చునంతా ప్రజలపై మోపి కార్పొరేట్ సంస్థలకు లాభాలు చేకూర్చుతున్నారని విమర్శించారు. బిజెపి విధానాలను రాష్ట్రంలో అమలు చేయడంతో దళితులకు, గిరిజనులకు, వృత్తిదారులకు ఇచ్చే సబ్సిడీలను కూడా కోల్పోతున్నారని తెలిపారు. ప్రజలపై భారాలు వేసే కరెంటు ఛార్జీల పెంపునకు వ్యతిరేకంగా సోమవారం సచివాలయాలు, ఎఇ కార్యాలయాలు, ఎపిఇపిడిసిఎల్ వద్ద జరిగే ధర్నాలు, నిరసనల్లో పాల్గొని జయప్రదం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శులు పి.మణి, బి.జగన్, కోశాధికారి ఎస్.జ్యోతీశ్వరరావు, కెఎం.కుమారమంగళం, ఎ.సీతాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కుమార్

కార్మికుల సమ్మె వాయిదా

జివిఎంసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : జివిఎంసిలో మునిసిపల్ కార్మికులు సోమవారం నుంచి జరపతలపెట్టిన సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి తెలిపారు. మూడు రోజులుగా జివిఎంసి కమిషనర్ ఆదేశాల మేరకు అదనపు కమిషనర్లు శ్రీనివాసరావు, సన్యాసిరావు, సిఎంఒ హెచ్, చీఫ్ ఇంజినీర్, ఎడిహెచ్‌లు జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు)తో చర్చలు సందర్భంగా డిమాండ్ల పరిష్కారానికి కాల పరిమితిని ఒప్పందంలో పేర్కొన్న సందర్భంగా సమ్మెను వాయిదా వేసినట్లు వివరించారు. జివిఎంసిలో పారిశుధ్య కార్మికులతో పాటు నీటి సరఫరా, అన్ని విభాగాల నుంచి పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలు, రిటైర్డ్, అనారోగ్యం, దీర్ఘకాలిక అనారోగ్యం కార్మికుల కుటుంబ సభ్యులకు ఎటువంటి ఆంక్షలు లేకుండా ఉపాధి కల్పించడానికి స్పష్టమైనటువంటి ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. నీటి సరఫరా, ఇంజినీరింగ్‌కు సంబంధించి టర్న్‌కాక్, ఎలక్ట్రికల్ హెల్పర్స్, ఫిట్టర్ హెల్పర్స్, రైవాడ కెనాల్, ప్లాంట్‌లో పనిచేస్తున్న వారికి సెమీస్కిల్డ్ వేతనాలు చెల్లించుటకు, డిప్లమో, ఇంజనీరింగ్ సర్టిఫికెట్స్ ఉన్నవారికి, హెవీ వెహికల్ లైసెన్స్ ఉన్న వారికి స్కిల్డ్ వేతనం చెల్లించడానికి అంగీకారం కుదిరిందని చెప్పారు.

చెత్త తరలించే వాహన డ్రైవర్లు, మలేరియా, వెటర్నరీ, యుజిడి కార్మికులకు లైఫ్ రిస్క్ ఉన్నందున, పారిశుధ్య కార్మికుల వలే హెల్త్ అలవెన్స్ అమలు చేయడానికి స్పష్టంగా అంగీకరించారని తెలిపారు. క్లాప్ వాహన డ్రైవర్లకు జాయింట్ లేబర్ కమిషనర్ ఆదేశాల మేరకు రూ.18,500 చెల్లించుటకు, కౌన్సిల్ ఆమోదం తీసుకొని అమలుకు అంగీకరించారని పేర్కొన్నారు. కాంట్రాక్ట్, ఇంజినీరింగ్, మలేరియా, శుభ్రత, ఇతర అవుట్ సోర్సింగ్

మిగతా 2లో..

24 వరకు ఒంటిపూట బడులు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : రాష్ట్రమంతా వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకొని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడకూడదని మరోవారం రోజుల పాటు ఒంటిపూట బడులు కొనసాగించాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్ కుమార్ ఆదివారం ఒక ప్రకటన విడుదలచేశారు. ఈ నెల 24వ తేదీ వరకు అన్ని ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాల యాజమాన్యాలు ఉదయం 7:30 నుంచి 11:30 గంటల వరకు నడపాలని పేర్కొన్నారు. రాగి జావ ఉదయం 8:30 నుంచి 9:00 గంటల వరకు, మధ్యాహ్న భోజనం 11:30 నుంచి 12 గంటల వరకు నిర్వహించాలని పేర్కొన్నారు.

కెకె.లైన్‌లో పట్టాలు తప్పిన గూడ్స్ - పలు రైళ్ల రద్దు

వార్త మెయిన్‌లో..

వడదెబ్బతో న్యాయవాది మృతి

వార్త మెయిన్‌లో..

నిర్మాణ రంగాన్ని కాపాడుకోవాలి : ఉప ముఖ్యమంత్రి బూడి

వార్త మెయిన్‌లో..

పలు రైళ్ల రద్దు

మరికొన్ని దారి మళ్లింపు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : దక్షిణ మధ్య రైల్వేలోని విజయవాడ డివిజన్‌లో ట్రాక్ ఆధునిక పనుల కారణంగా పలు రైళ్లను రద్దు చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. 07466 రాజమండ్రి-విశాఖపట్నం పాసింజర్, 07467 విశాఖపట్నం రాజమండ్రి పాసింజర్, 12767 కాకినాడ-విశాఖపట్నం పాసింజర్, 17268 విశాఖపట్నం- కాకినాడ పాసింజర్, 17239 గుంటూరు విశాఖపట్నం- సింహాద్రి ఎక్స్‌ప్రెస్, 22701 విశాఖపట్నం-విజయవాడ ఉదయ్ ఎక్స్‌ప్రెస్, 22702 విజయవాడ-విశాఖపట్నం ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌లను ఈ నెల 19 నుంచి 25వ తేదీ వరకు, 17240 విశాఖపట్నం -గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 20 నుంచి 26వ తేదీ వరకు రద్దు చేశారు.

కోరమండల్ ప్రమాదంలో దెబ్బతిన్న ఖరగ్‌పూర్ డివిజన్‌ను మహేన్బాగ్ స్టేషన్లో ట్రాక్ పునరుద్ధరణ పనులలో భాగంగా 07030 సికింద్రాబాద్ - అగర్తలా ఎక్స్‌ప్రెస్, 22878 ఎర్నాకులం - హౌరా అంత్యోదయ ఎక్స్‌ప్రెస్‌లను ఈ నెల 19న రద్దు చేస్తున్నట్టు అధికారులు తెలిపారు.

13351 ధన్బాద్ -అలపూజా బొకారో ఎక్స్‌ప్రెస్ ఈ నెల 20, 23, 24 తేదీలలోను, 12835 హటియా-ఎస్ఎంవి బెంగళూరు సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 20వ తేదీన, 12889 టాటానగర్-ఎస్ఎంబి బెంగళూరు ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 23న, 18637 హటియా-ఎస్ఎంవి బెంగళూరు వీక్లీ ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 24న నిడదవోలు, భీమవరం టౌన్, గుడివాడ, విజయవాడ మీదుగా మళ్లించిన మార్గంలో నడుస్తాయని పేర్కొన్నారు.

ఎకో వైజాగ్‌పై దృష్టి!

- పారిశుధ్య సేవల్లో 8వేల మంది సిబ్బంది
- ఇంకా 1000 మంది అవసరం
- నగర ప్రజల్లో అవగాహన పెరగాల్సి ఉంది

-ప్రజాశక్తితో జివిఎంసి సిఎంఒ డాక్టర్ నరేష్ కుమార్ ఇఎన్‌వి

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖను అన్ని విషయాల్లోనూ పర్యావరణ హితంగా మార్చేందుకు 'ఎకో వైజాగ్' నినాదంతో పారిశుధ్య సేవలు అందించేందుకు కృషి ప్రారంభించినట్లు గ్రేటర్ విశాఖ నగర పాలక సంస్థ (జివిఎంసి) చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఆఫ్ హెల్త్ (సిఎంఒ) డాక్టర్ నరేష్ కుమార్ ఇఎన్‌వి వెల్లడించారు. ఇటీవలే ప్రజాశక్తికి ఆయన ఇంటర్వ్యూ ఇచ్చారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను బ్యాన్ చేయాల్సిన అవసరాన్ని ఆయన వివరించారు. ఎకో-శానిటేషన్, ఎకో-బ్లూ, ఎకో-గ్రీన్, ఎకో-జీరో ప్లాస్టిక్, ఎకో-ఎయిర్ పొల్యూషన్ తమ ప్రాధాన్యతలుగా వివరించారు. ప్రతి వారమూ ఇందుకోసం నగరంలోని పలుచోట్ల క్లీన్-గ్రీన్ కార్యక్రమాన్ని సాగర తీరం, ఇంకా పలుచోట్ల నిర్వహణకు జివిఎంసి

మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

పెంచిన కరెంటు ఛార్జీలు రద్దు చేయాలి

విమర్శించారు. ఈ ఛార్జీలను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

గృహ వినియోగదారులకు, రైతుల వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు పెట్టడానికి సిద్ధపడుతున్నారని తెలిపారు. ప్రతి కనెక్షన్‌కు రూ.13 వేలు ఖర్చు అవుతుందన్నారు. దీని కాంట్రాక్టు అదానీ కంపెనీకి ఇస్తున్నారని తెలిపారు. వీటిఖయ్యే ఖర్చును ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గాని ప్రజల నుంచే గుంజుతారని పేర్కొన్నారు. అదానీ వంటి కార్పొరేట్ల ప్రయోజనాలకు దేశ ప్రజల, రైతుల ప్రయోజనాలను ఫణంగా పెడుతోందని విమర్శించారు. ఈ విధానాలను కొన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు తిరస్కరించాయని, మోడీ ప్రభుత్వ పల్లకి మోస్తున్న వైసిపి ప్రభుత్వం కేంద్రాన్ని ఎదిరించకుండా సాగిలపడుతోందని విమర్శించారు. విద్యుత్ సమస్యలపై సోమవారం చేపట్టే నిరసనల్లో ప్రజలు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. పెంచిన అక్రమ ఛార్జీలు, స్మార్ట్ మీటర్లు రద్దుచేసే వరకు ప్రజలు ప్రతిఘటించాలని విజ్ఞప్తి చేశారు.

కార్మికుల సమ్మె వాయిదా

కార్మికులను పర్మినెంట్ చేయుటకు ప్రభుత్వానికి సిఫార్సు లెటర్ రాసేందుకు, జివిఎంసిలో అన్ని సెక్షన్లు, డిపార్ట్‌మెంట్ కార్మికులకు వారం సెలవు, తొమ్మిది పబ్లిక్ హాలిడేస్, 15 సెలవులు అమలు చేయుటకు, ఇన్స్యూరెన్స్ చేయుటకు, జనాభా, విస్తీర్ణం ఆధారంగా సిబ్బంది పెంచుటకు అంగీకరించారని తెలిపారు. మొత్తం 39 డిమాండ్ల మీద జివిఎంసి అధికారులు స్పష్టమైన రాత పూర్వక హామీ ఇవ్వడం వల్ల సమ్మెను విరమించినట్లు తెలిపారు. ఈ చర్చల్లో అధికారులతో పాటు జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు టి.నూకరాజు, ప్రధాన కార్యదర్శి ఊరుకూటి రాజు, ఆఫీస్ బేరర్స్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొత్తం కార్మికుల డిమాండ్లను పరిష్కరించినందుకు గాను ముఖ్యమంత్రికి, కమిషనర్‌కు యూనియన్ తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఒప్పందాన్ని కాలపరిమితిలోగా పరిష్కారానికి కృషిచేయాలని అధికారులను విజ్ఞప్తి చేశారు. సోమవారం నుంచి మొత్తం కార్మికులు విధుల్లోకి వెళ్లాలని వెంకటరెడ్డి కోరారు.

ఎకో వైజాగ్‌పై దృష్టి

కమిషనర్ శ్రీకారం చుట్టారని తెలిపారు. ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూ ఆయన మాటల్లోనే...

జివిఎంసిలో పారిశుధ్య సిబ్బంది సరిపడా ఉన్నారా?

ప్రస్తుతం 8 జోన్లలో ఇళ్ల నుంచి చెత్తను సేకరించేందుకు 8వేల మంది పర్మినెంట్, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది ఉన్నారు. రోడ్లు, హైవేలలోనూ చెత్త బిన్స్ ఏర్పాటు చేశాం. ఇదంతా కాపులుప్పాడ యార్డుకు నిత్యం చేర్చుతున్నాం. అక్కడ వేస్ట్ మేనేజిమెంట్ ప్రోసెస్ జరుగుతుంది. పర్యావరణ హితంగా ఈ ప్రక్రియ సాగుతోంది. విశాఖ నగరంలో ఇంకా 1000 మంది పారిశుధ్య సిబ్బంది క్షేత్రస్థాయిలో అవసరం. ఖాళీలు 486 ఉన్నాయి. వీటిని భర్తీచేయనున్నాం.

విశాఖ నగరం పూర్తిగా క్లీన్-గ్రీన్ కావాలంటే ఎదురయ్యే సవాళ్లేమిటి?

ముందుగా నగర ప్రజలు పారిశుధ్యంపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అవగాహనే పెద్ద సవాలుగా ఉంది. ప్రస్తుతం 595 క్లాప్ వెహికల్స్‌తో పారిశుధ్య సిబ్బందిని అసిస్టెంట్లుగా వాహనాలకు ఇస్తూ చెత్తను ఏరివేస్తున్నాం. సేకరించిన చెత్తనంతా కాపులుప్పాడ యార్డుకు పంపుతున్నాం. కొన్నిచోట్ల చెత్తను రోడ్లపైకి, కాలువల్లోకి ప్రజలు విసిరేయడంతో పర్యావరణ సమస్యలు తలెత్తుతున్నాయి. అలా చేయకుండా వాహనానికే పొడి, తడి చెత్తను వేరుచేసి అందించాలి. విశాఖ నగరం, భీమిలి నుంచి అనకాపల్లి వరకూ చెత్త సేకరణ సమర్ధవంతంగా చేపడుతున్నాం.

ప్రధాన సమస్యలేమిటి?

ప్లాస్టిక్ వేస్ట్ అధికంగా నగరం నుంచి ఉత్పత్తి అవుతోంది. ఇది మానవ మనుగడను దెబ్బతీస్తోంది. భావితరాలకు మంచి వాతావరణం అందించాలంటే ప్లాస్టిక్‌ను నివారించాలి. రోజుకు విశాఖ నగరం నుంచి 300 టన్నులు ప్లాస్టిక్ వేస్ట్ వస్తోంది. ఈ సవాల్‌ను నగరం అధిగమించేలాగ జివిఎంసి కృషిచేస్తోంది. అవగాహన ప్రచార కార్యక్రమాలను చేపడుతున్నాం. నగర పౌరులను భాగస్వామ్యం చేయకుండా ఏ పనీ విజయవంతం కాదు.

యూజర్ ఛార్జీల వసూళ్లు ఎలా ఉంది?

యూజర్ ఛార్జీల వసూళ్లలో మందకొడితనం ఉంది. రూ.2 కోట్లు యూజర్ ఛార్జీలు నెలకి రావాల్సి ఉంది. ఈ వాహనాలు, వాటికి డీజిల్, సిబ్బంది జీతాలకు రూ.5కోట్లు ఖర్చవుతోంది. యూజర్ ఛార్జీలు చెల్లించడం లేదని ప్రజలకు సేవలేవీ ఆపడం లేదు. ప్రజలే ముందుకొచ్చి యూజర్ ఛార్జీలను చెల్లించాలి.

808వ రోజుకు దీక్షలు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక, ప్రజాసంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన దీక్షలు ఆదివారం నాటికి 808వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలలో సిఎఫ్‌టియుఐ మత్స్యకార మహిళలు కె.లక్ష్మి, ఎం.లక్ష్మి, జి.ఎర్రమ్మ, జి.లక్ష్మి, ఎస్.రాజు, ఎస్.రమ్య, జి.అను, ఎన్.దివ్య తదితరులు పాల్గొన్నారు.

సంపద ఒకవైపే పోగుపడుతుందా?

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'కొనడం, అమ్మడం ప్రాథమికంగా సమాజ వ్యతిరేకమైనది'. అని అంటారు ఎడ్వర్డ్ బెల్లామి అనే ప్రపంచ ప్రసిద్ధ రచయిత. "శ్రమ ఎవడిదిరో...సిరి ఎవడిదిరో" అంటాడు మరో విప్లవ కవి చెరబండరాజు. వీటన్నిటి సారాంశం సంపద, డబ్బు, భూమి ఇలా స్థిర, చరాస్తులేవైనా సరే ఒకవైపే ఒరిగిపోకూడదన్నదే సారాంశం. ఇలా పోగుపడకుండా నియంత్రించాల్సిన బాధ్యత ప్రజాస్వామ్య ప్రభుత్వాలు, అధికార యంత్రాంగంపై ఉందన్నది మరచిపోకూడదు. సంపదపై పట్టు కొద్దిమంది వ్యక్తులకుంటే సమాజానికి ఎంత నష్టమో అన్నది ఎడ్వర్డ్ బెల్లామికి ముందే కారల్ మార్క్స్ మహాశయుడు తన పెట్టుబడి గ్రంథంలో వెల్లడించాడు. ఈ రోజు ఎక్కడ చూసినా భూమాఫియాలు... భూముల వివాదాలు... సినీ ఫక్కీలో ఛేజింగులు, కిడ్నాప్‌లు రాజ్యమేలుతున్నాయి. విశాఖకూ ఈ చీడ అంటుకుంది. డబ్బుకోసం పెద్దమనుషులను కిడ్నాప్ చేసే దాకా భూ దందాల వ్యవహారం వచ్చేసింది. విశాఖ ఎంపీ ఎంవివి సత్యనారాయణ కుటుంబాన్ని, అతని సన్నిహితులైన ఆడిటర్ జీవీని ఒక రౌడీషీటర్ మరో ఆరుగురుతో కలిసి కిడ్నాప్ చేసి రూ.కోట్లకు డిమాండ్ చేయడం తాజాగా విశాఖనగరం నడిబొడ్డున చోటుచేసుకుంది. తర్వాత పోలీసులు రంగంలోకి దిగి నిందితులను పట్టుకోవడం, వారికి చట్టప్రకారం జరగాల్సిన ప్రక్రియ ఎలాగూ సాగిపోతుంది.

సిట్ నివేదికను బుట్టదాఖలు చేసిన ప్రభుత్వాలు..

తాజా ఘటనతో ప్రభుత్వం గానీ, అధికార యంత్రాంగం గానీ మేల్కొనాల్సిన అంశాలను గనక ఒక్కసారి పరికించి చూస్తే.. అక్రమ భూ వ్యవహారాలు, కబ్జాలు, దందాలకు ఆస్కారం లేకుండా చర్యలు చేపట్టనందున భూ మాఫియా, రౌడీషీటర్లు రెచ్చిపోవడం అన్నది ప్రత్యక్షంగా కనిపిస్తోంది. విశాఖలో తొలినుంచీ ఈ భూ వ్యవహారాలు ఇలా సాగిపోతూనే ఉన్నా కట్టడి చేసే నాథుడు లేడు. దసపల్లా భూ వివాదాన్ని సైతం అడ్డగోలుగా ప్రభుత్వం పరిష్కరించుకుంది. గతంలో భూ కబ్జాలు, ల్యాండ్ ట్యాంపరింగ్‌లపై 3500కు పైగా విశాఖ నగరం, గ్రామీణ ప్రాంతాలైన భీమిలి, ఆనందపురం, పద్మనాభం, గాజువాక, పెందుర్తి వంటి చోట్ల నుంచి ఫిర్యాదులను ప్రభుత్వం నియమించిన 'సిట్'కు అందగా వాటిని గత చంద్రబాబు, నేటి వైసిపి ప్రభుత్వం రెండూ బుట్టదాఖలు చేశాయి. ఈ ఫిర్యాదులకు ఎలాంటి విలువా లేకుండా పోయింది.

2019లో వైసిపి ప్రభుత్వం వచ్చాక వీటిపై చర్యలుంటాయని పదేపదే ఆ పార్టీ మంత్రులు చెప్పినా ఆచరణలో చర్యలకు ఎగనామం పెట్టి ఆ భూముల వివరాలతో ఈ పార్టీనేతలూ పబ్బం గడుపుకోవడం పలుచోట్ల కనిపిస్తోంది.

వైసిపి అధికారంతో ఎంవివి భూ ప్రాజెక్టులపై చర్చ...

వైసిపి అధికారంలో హయగ్రీవా భూ వ్యవహారం, సిరిపురం క్రిస్టియన్ భూముల వివాదం, దసపల్లా భూ సమస్యలు, కుసులవాడలో అక్రమ ల్యాండ్ పూలింగ్, రుషికొండలో ప్రభుత్వ డి పట్టా భూముల కబ్జాకు పాల్పడిన చెన్నాదాస్ వ్యవహారం ఈ ప్రభుత్వ హయాంలోనూ గుప్పుమన్నాయి. ఎంపీ ఎంవివి రియల్ ఎస్టేట్ ఓనర్లు, బిల్డర్ల మధ్య వివాదాలను పరిష్కరించి ఆ ప్రాజెక్టులను తను చేజిక్కించుకోవడంతో అందరినోటా ఎంవివి రియల్ చర్యలపై ఈ కాలంలో సర్వత్రా చర్చ వినిపించింది. అక్రమణలకు పాల్పడుతున్నాడంటూ ఆరోపణలు ఎంపీ ఎదుర్కొన్నారు. భూ వివాదాలను పరిష్కరించాల్సిన జిల్లా రెవెన్యూ ఉన్నతాధికారుల జోక్యం పూర్తిగా పరిమితమైపోయింది.

రెవెన్యూ లొంగుబాటు...

కుసులవాడ, రుషికొండ ఇలా విశాఖ నగరంలో పలు భూ కబ్జాల విషయంలో రెవెన్యూ అధికారులు భూ కబ్జాకోర్లకు లొంగిపోవడం కనిపించింది. ఎక్కడా ప్రభుత్వ భూమి లేకుండా కబ్జారాయుళ్లు చేసేశారు. విశాఖకు రాజధాని వస్తుందన్న ప్రచారంతో మరింత దోపిడీకి రుషికొండ వంటిచోట్ల చెన్నాదాస్ పాల్పడ్డాడు. ఇలా భూములను తమ గుప్పెట పెట్టుకుని అక్రమ నిర్మాణాలు, స్థలాల అమ్మకాలతో మధ్యతరగతి, పేదలను వంచిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎక్కడికక్కడ భూముల ధరలకు రెక్కలు రావడం, పేదోడికి సెంటు భూమి కూడా దొరక్కపోవడం వంటి సన్నివేశాలతో విశాఖనగరం, గ్రామీణ ప్రాంతాల్లో భూ వివాదాలు పేట్రేగిపోతున్నాయి.

ఇల్లు, స్థలం ఏది కొనాలన్నా... బెంబేలెత్తేలా ధరలు...

సామాన్యుడు లేదా మధ్యతరగతికి చెందిన వారు ఇల్లు కొనుగోలు చేయాలంటే ఫ్లాట్‌ల ధరలు, ప్లాట్‌ల ధరలూ రాబోయే 25ఏళ్లకు నిర్ణయించాల్సిన రేట్లు 2022లోనే రియల్ ఎస్టేట్ మదుపరులు నిర్ణయించేయడంతో రూ.కోట్లు వెచ్చించలేక ఈ తరగతులు అవస్థలుపడుతున్నాయి. ఈ ధరలను ప్రభుత్వ పరంగా నియంత్రించకపోవడంతో రియల్ ఎస్టేట్ రాజ్యంగా విశాఖపట్నం మారిపోయింది. గజం భూమి ఉంటే రూ.లక్షలు పలికించేసి పబ్బం గడుపుకుంటున్నారు. అప్పటికే భూముల్లో వివాదం ఉంటే అధికార పార్టీ అండతో మధ్యలో దూరి సెటిల్‌మెంట్ చేసుకుని రూ.వేల కోట్లకు పడగలెత్తుతున్నారు. ప్రభుత్వ, ప్రజా హక్కుగా ఉండాల్సిన భూమిని ఆధారం చేసుకుని ఇలా సంపద ఒకవైపే కేంద్రీకృతం కావడం అన్నది ఇటీవల కాలంలో విశాఖలో పెరిగిపోయింది. ఈ లావాదేవీలతో సంబంధం ఉండేవారంతా అక్రమ మార్గాలను అవలంభిస్తుండడం కనిపిస్తోంది. ఎంపీ కుటుంబ సభ్యులనూ ఇలా డబ్బుకోసం కిడ్నాప్ చేసిన ఉదంతం చోటుచేసుకోవడం చూశాం. ఇలాంటి ఉదంతాలు పునరావృత్తం కాకుండా చూడాల్సిన బాధ్యత అధికార యంత్రాంగం, ప్రభుత్వంపై ఉందని ప్రజానీకం పెద్ద ఎత్తున భావిస్తున్నారు.

'గిరిజన ప్రాంతానికి వెళ్లిన ఉపాధ్యాయులందరికీ న్యాయం చేస్తాం'

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : విశాఖ జిల్లా ఎస్‌జిటిల బదిలీల్లో ఊహించని విధంగా మారుమూల గిరిజన ప్రాంతాలకు బదిలీ అయిన మైదాన ప్రాంతానికి చెందిన భార్యా భర్తల కోటా ఉపాధ్యాయులు, మహిళలు, ఉద్యోగ విరమణకు దగ్గరలో ఉన్న సీనియర్ ఉపాధ్యాయులందరికీ న్యాయం చేస్తామని పిఆర్‌టియు ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డి.గోపీనాథ్ హామీ ఇచ్చారు. డాబాగార్డెన్స్‌లో ఉన్న జివిఎంసి ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఆదివారం ఏర్పాటుచేసిన అల్లూరి సీతారామరాజు జిల్లాలోని మారుమూల గిరిజన ప్రాంతాలకు బదిలీ అయిన ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎటువంటి రవాణా సదుపాయం లేని, నివాసయోగ్యం కాని మారుమూల గిరిజన ప్రాంతాలకు మైదాన ప్రాంతాల్లో ఎంపికైన ఉపాధ్యాయులను బదిలీ చేయొద్దని కోరామన్నారు. అయినా విశాఖ జిల్లాలో సుమారు 500 మంది ఉపాధ్యాయులకు తీరని అన్యాయం జరిగిందన్నారు. దీనిపై సోమవారం అమరావతిలో జరుగునున్న విద్యాశాఖ మంత్రి సమావేశంలో ప్రస్తావిస్తామన్నారు. అప్పటికీ పరిష్కారం కాకుంటే దీనిపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు. పిఆర్ టియు నాయకులు నాగేశ్వరరావు, దుర్గారావు, రవి, రాజు, పట్నాయక్, రామకృష్ణ, తులసీలక్ష్మి, భవాని పాల్గొన్నారు.

స్వరూపానందేంద్రను కలిసిన కలెక్టర్

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : విశాఖ జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున ఆదివారం శారదాపీఠాన్ని సందర్శించారు. రాజశ్యామల అమ్మవారిని దర్శించుకున్నారు. పీఠాధిపతులు స్వరూపానందేంద్ర స్వామిని కలిశారు. చాతుర్మాస్య దీక్ష చేపట్టేందుకు రిషికేష్ వెళుతున్న పీఠాధిపతుల నుంచి కలెక్టరు ఆశీస్సులు అందుకున్నారు.

సెప్టెంబర్‌లో ఆప్తా 15 ఏళ్ల వేడుకలు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ (ఆప్తా) 15 ఏళ్ల వేడుకలను సెప్టెంబర్ 1, 2, 3 తేదీల్లో అమెరికాలోని అట్లాంటాలో నిర్వహిస్తున్నామని 15సంవత్సరాల సదస్సు కన్వీనర్ విజయ్ గుడిసేవ తెలిపారు. ఆదివారం ఉదయం నగరంలోని ప్రముఖ హోటల్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ ఏర్పాటుచేసి 15 ఏళ్లు అవుతున్న సందర్భంగా ఈ కన్వెన్షన్ నిర్వహిస్తున్నామని తెలిపారు. వివిధ రంగాల్లో నిష్ణాతులైనన తెలుగు ప్రముఖులను సత్కరించేందుకు నిర్ణయించామన్నారు. గతానికి భిన్నంగా ఈ సారి మిలటరీకి చెందిన 10 మందిని కూడా సత్కరించనున్నామని చెప్పారు. ఈ సదస్సుకు మంత్రి బొత్స సత్యనారాయణ, గంట శ్రీనివాసరావు, కన్నబాబు, మెగాస్టార్ చిరంజీవి, పవన్ కల్యాణ్ తదితరులను ఆహ్వానించామన్నారు.

ఆప్తా పూర్వ అధ్యక్షులు గోపాల్ గూడపాటి మాట్లాడుతూ, తెలుగు రాష్ట్రాల్లో మెరిట్ విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో ఆప్తా మీడియా చైర్మన్ చంద్రశేఖర్ పోలిశెట్టి పాల్గొన్నారు.

అసాంఘిక, అరాచక శక్తుల అడ్డాగా విశాఖ : టిడిపి

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : ప్రశాంత విశాఖ నగరం అసాంఘిక, అరాచక శక్తుల అడ్డాగా మారిందని టిడిపి నాయకులు ఆరోపించారు. ఆదివారం టిడిపి కార్యాలయం నుంచి వందలాది మందితో జివిఎంసి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం టిడిపి విశాఖ పార్లమెంట్ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే పి.గణబాబు, మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, మాజీ ఎమ్మెల్యేలు గండి బాబ్జి, పీలా గోవింద సత్యనారాయణ, బుద్ధ నాగజగదీశ్వరరావు, సర్వసిద్ధి అనంతలక్ష్మి మాట్లాడారు.

IN THE HON'BLE COURT OF THE VII ADDL. SENIOR CIVIL JUDGE, AT : VISAKHAPATNAM
I.A.235/2021 in I.A.46/2019 in O.S.1667/2015

Between :
Pitta Balaram..Petitioner/Plaintiff
And
Pureddy Kameswari
...Respondent/Defendant

NOTICE

To,
The Respondent:
Pureddy Kameswari,
W/o. Pydireddy, Hindu,
aged about 39 years, R/at.
D.No.46-3-37, Kummari Veedhi,
Dondaparthy, Visakhapatnam.

Please take notice that the above named petitioner/plaintiff has instituted the above petition against you and the matter stands posted to **27-06-2023** for your appearance, on that day at **10:30 A.M.**, you should appear before the aforesaid Hon'ble Court either in person or through an Advocate without fail, else the matter will be determined in your absence and necessary orders will be passed.

(By Order of the Hon'ble Court)
SURAMPUDI SRINIVASA RAO
S. RAVI VARMA,
Advocates
Visakhapatnam.
Cell: 9849362601.

శుద్ధిపై ఏదీ శ్రద్ధ..?

- జివిఎంసి కుళాయిల ద్వారా కలుషితనీరు సరఫరా
- శుద్ధి చేయకుండానే నేరుగా అందిస్తున్న యంత్రాంగం
- ఆందోళన చెందుతున్న ప్రజలు.. పట్టించుకోని అధికారులు

పాడైపోయిన నీటి శుద్ధి గ్యాలరీ

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి కుళాయిల ద్వారా అపరిశుభ్రమైన, రంగుమారిన నీటిని సరఫరా చేస్తుండడంపై ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ముడసర్లోవ రిజర్వాయర్ నుంచి జివియంసి సరఫరా చేస్తున్న కుళాయి నీరు రంగు మారడం, నీచు కంపు కొడుతున్న నీటిలో కొంచెం క్లోరిన్ కలిపి అందజేస్తున్నారు. నీటిని శుద్ధి చేసే గ్యాలరీ పూర్తిగా పాడైపోవడంతో నేరుగా చెరువు నీటినే ప్రజలకు కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్నారని తెలుస్తోంది. దీంతో నీరు గోధుమ రంగులో ఉండడం, నీచు కంపు కొట్టడం, నీటిలో నలకలు ప్రత్యక్షం కావడంతో వీటిని తాగేందుకు ప్రజలు భయపడుతున్నారు. దీనిపై ప్రజా సంఘాలు, స్థానిక ప్రజలు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా జివిఎంసి అధికారులు గానీ, అధికారంలో ఉన్న రాజకీయ నాయకులు గానీ పట్టించుకునే పాపాన పోలేదు. శుద్ధి చేయని నీటిని తాగి చాలా మంది రోగాల బారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. అలాగని డబ్బులు వెచ్చించి మంచినీటిని కొనాలన్నా, వాటిని దుకాణం నుంచి తేవాలన్నా ధరా భారంగా

జివిఎంసి కుళాయిలో వచ్చిన రంగు మారిన నీరు

ఉందని అసహనం వ్యక్తం చేస్తున్నారు. రిజర్వాయర్ చుట్టూ కోట్లు వెచ్చించి రక్షణ గోడ నిర్మించడంలో ఉన్న శ్రద్ధ, ఎక్కువ మంది పేదలు నివాసాలుండే ఆరిలోవ ప్రాంత ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించడంలో ఈ పాలకులకు లేదని స్థానికులు విమర్శలు చేస్తున్నారు. ప్రతి నెలా నీటి పన్ను చెల్లిస్తున్న నగర వాసులకు, మంచినీటిని సరఫరా చేసే బాధ్యతను జివిఎంసి యంత్రాంగం విస్మరించడం ఎంతవరకు సబబని ప్రశ్నిస్తున్నారు.

దీనిపై స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ముడసర్లోవ రిజర్వాయర్ వద్ద గల శుద్ధి చేసే గ్యాలరీని పరిశీలించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ, జివిఎంసి కుళాయిల ద్వారా ప్రజలకు సరఫరా చేసే తాగునీటి శుభ్రత, నాణ్యతపై తగిన చర్యలు తీసుకోవాలని ఎన్నిసార్లుచెప్పినా స్పందన లేకపోవడం నిర్లక్ష్యమేనన్నారు. ఇప్పటికైనా నగర మేయర్, సంబంధిత అధికారులు, స్పందించి, కుళాయిల ద్వారా సరఫరా చేసే తాగునీటిని శుద్ధి చేసే చర్యలపై దృష్టి పెట్టాలని కోరారు. కలుషితనీటితో ప్రజలు రోగాల బారిన పడిన తర్వాత మేలుకోకుండానే ముందస్తుగానే తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుకుంటున్నారు. ముఖ్యంగా వర్షాల సీజన్ ప్రారంభానికి ముందే నీటి శుద్ధిపై దృష్టి పెట్టాలని కోరుతున్నారు.

నేరాలు ఘోరాలు

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

ప్రజాశక్తి- తగరపువలస : మహిళ హత్యకేసును భీమిలి పోలీసులు చేధించారు. శనివారం నిందితుడిని అరెస్ట్ చేశారు. నగర పోలీసు కమిషనర్ సీఎం త్రివిక్రమ వర్మ ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన లా అండ్ ఆర్డర్ డిసిపి విద్యా సాగర్ నాయుడు, నేర విభాగం డిసిపి నాగన్న , నార్త్ ఎసిపి,శివరాం రెడ్డి, భీమిలి సిఐ కె లక్ష్మణమూర్తి తో పాటు ఎస్ఐలు గంటా హరీష్, భరత్ కుమార్‌రాజు, తాతారావు కేసును చేధించి, నిందితుడిని అరెస్ట్‌చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. విజయనగరం జిల్లా భోగాపురం మండలం, చాకివలస గ్రామానికి చెందిన అరసవిల్లి శ్రీలక్ష్మి (35), ఈ నెల 11న హత్యకు గురైన ఘటన స్థానికంగా సంచలనం సృష్టించింది. తొలుత అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేయగా, లోతుగా జరిపిన విచారణలో హత్యగా నిర్ధారించారు. జివిఎంసి రెండో వార్డు ఆదర్శనగర్‌లో అద్దె ఇంట్లో ఉంటున్న దివీస్‌లో సివిల్ కాంట్రాక్టర్ వద్ద ఫేబ్రికేషన్ పని చేస్తున్న కేరళ రాష్ట్రం, పతనంతిట్ట జిల్లా , వడస్సె రిక్కరకు చెందిన ఒలిక్కల్ ప్రదీప్ హత్యకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో తేలింది.

హత్య జరిగిందిలా....

తన భార్య సొంతూరు వెళ్లిందని, తానొక్కడినే ఇంటి వద్ద ఉన్నానని హత్యకు గురైన లక్ష్మిని , నిందితుడు ప్రదీప్ ఫోన్ ద్వారా పిలిచాడు. అన్నవరం వద్ద ఉన్నట్లు తెలుసుకుని, బైక్‌పై వెళ్లి ఇంటికి తీసుకొచ్చాడు. శారీరకంగా కోర్కె తీర్చుకున్నాడు. రూ.800 ఇచ్చేందుకు ఒప్పుకుని, రూ.500 ఇవ్వడంతో ఆమె నిరాకరించింది. దీంతో ఇరువురి మధ్య తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకుంది. దీంతో తాను నివాసమున్న పెంట్ హౌస్ పిట్ట గోడ పైనుంచి ఆమెను కిందకు తోసేశాడు. కొన ఊపిరితో ఉన్న ఆమెను కూరగాయల కత్తితో హత్యచేసి, బెడ్‌షీట్‌లో మూటగట్టి, బైక్‌పై జాతీయ రహదారి సబ్బి వీది, సర్వీస్ రోడ్డు ఎడమ వైపు పడేశాడు. హతురాలు లక్ష్మికి ఇద్దరు పిల్లలున్నారు. దివీస్‌లో పనిచేసేటప్పుడు నిందితుడితో ఆమెకు పరిచయం ఉంది.

అప్పు తీర్చలేదని వ్యక్తిపై దాడి

ప్రజాశక్తి -గాజువాక : అప్పు తీర్చలేదని వ్యక్తిపై దాడి చేసిన ఘటన వుడా కాలనీలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాలివి. బి ప్రసాద్ పెదగంట్యాడలో నివాసం ఉంటున్నారు.. ఆరు నెలల క్రితం భూపతి ఆచారి, భాను ప్రకాష్, శ్రీను అను ముగ్గురు దగ్గర రూ.2,80,000 నగదు అప్పు తీసుకున్నారు. అప్పు తీసుకుని తీర్చకోగా సొంత ఊరు పార్వతీపురం వెళ్లిపోయారు. ఆదివారం ప్రసాదు రావడంతో, ఆయనను ఉదా కాలనీ పిలిపించిన ముగ్గురు, అతనిని ఇంట్లో బంధించి కత్తితో పొడిచారు. అందిన ఫిర్యాదు మేరకు ముగ్గురు నిందితులను న్యూ పోర్ట్ పోలీసులు అరెస్ట్ చేశారు. క్షతగాత్రుడిని ఆసుపత్రికి వైద్యానికి తరలించారు.

సృష్టి వరల్డ్ స్కూల్‌లో యోగా డే

ప్రజాశక్తి-ఉక్కునగరం : ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉక్కునగరం సెక్టర్ 11లోని సృష్టి వరల్డ్ స్కూల్‌లో ఆదివారం ముందస్తుగా యోగాడేను నిర్వహించారు. 'వసుధైక కుటుంబం కోసం యోగా' థీమ్‌తో పాఠశాల ఆవరణలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సంయుక్తంగా యోగాలో పాల్గొన్నారు. తల్లిదండ్రుల కోసం ప్రత్యేక సెషన్ నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం ఇ.చంద్రిక మాట్లాడుతూ, ప్రతిఒక్కరి దినచర్యలో యోగాను భాగం చేయాలనే లక్ష్యంతో దీనిపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. వందమందికి పైగా పాల్గొన్న విద్యార్థుల తల్లిదండ్రులకు అనుభవజ్ఞులైన అభ్యాసకులు యోగాసనాల టెక్నిక్స్‌లో శిక్షణనిచ్చారు.చీఫ్ ప్రిన్సిపల్ శ్రీధర్ బాబు, వైస్ ప్రిన్సిపల్ సునయన, పాఠశాల డైరెక్టర్ పి.సుశీలారాణి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ మేఘనా కంభం, కోఆర్డినేటర్లు ,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అసోసియేషన్ భవన నిర్మాణానికి సహకారం

ప్రజాశక్తి -గాజువాక : ప్రగతి టూవీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యకలాపాల నిర్వహణకు భవన నిర్మాణానికి సహకరిస్తానని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి హామీ ఇచ్చారు. ఆదివారం గాజువాక లంకా గ్రౌండ్‌లో నిర్వహించిన అసోసియేషన్ దశమ వార్షికోత్సవాన్ని జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అసోసియేషన్‌లో అర్హులైన సభ్యులందరికీ రాయితీతో రుణాలు మంజూరుకు కృషి చేస్తానన్నారు. అసోసియేషన్ కార్యదర్శి అప్పారి విష్ణుమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విశిష్ట అతిథి టిడిపి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు 70వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి చందు, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు డి.ధర్మ, రామకృష్ణ, నాయకులు కె. మోహనరావు, జుబేర్, గాజువాక నియోజక వర్గ సిపిఐసమితి సభ్యులు జి. ఆనంద్ పాల్గొన్నారు ..

దబ్బందలో ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి- ఆనందపురం: మామిడిలోవ పంచాయతీ దబ్బంద గ్రామంలో ఆదివారం రాఘవేంద్ర కంటి ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని భీమిలి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి కోరాడ రాజబాబు ప్రారంభించారు. గ్రామానికి చెందిన పొంతపల్లి అప్పలనాయుడు, కొల్లేటి అప్పలరాజు ఆధ్వర్యంలో రాఘవేంద్ర కంటి ఆసుపత్రి డాక్టర్ పి అజయ్ రోగులను పరీక్షించారు. సర్పంచ్ బలిరెడ్డి మల్లికార్జునరావు (చంటి), ఆనందపురం మండల పార్టీ అధ్యక్షుడు బొద్దాపు శ్రీనివాస్, గండ్రెడ్డి రమేష్ పాల్గొన్నారు

అప్రకటిత కరెంట్ కోతలతో అవస్థలు

- రేయింబవళ్లు తేడా లేకుండా విద్యుత్ నిలుపుదల
- ఉక్కిరిబిక్కిరి అవుతున్న జనాలు.. పట్టని అధికారులు

ప్రజాశక్తి -ఆనందపురం: మండుతున్న ఎండలు, వడగాలులతో ఒకవైపు రికార్డుస్థాయి ఉష్ణోగ్రతలు నమోదౌతుంటే, మరోవైపు వేళాపాళాలేని అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. మండలంలోని వెల్లంకి గ్రామంలో గత పదిరోజులుగా పగలురాత్రి తేడా లేకుండా ఇష్టానుసారంగా విద్యుత్తు నిలిపేస్తూ వృద్ధులు, చిన్నారులు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఆదివారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేయడంతో ప్రజలు ఇళ్లల్లో ఉండలేక, బయటకు రాలేక ఇబ్బందులకు గురయ్యాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు ఇక రాత్రిపూట కూడా విద్యుత్ సరఫరాను నిలిపేయడంతో ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా పోతోందని వాపోతున్నారు. దీనిపై వైసిపి నేత కాకర వెంకటరమణ స్పందిస్తూ, అప్రకటిత విద్యుత్ కోతలపై గ్రామాల్లో ప్రజలు అధికార పార్టీకి చెందిన నేతలుగా తమను నిలదీసి ప్రశ్నిస్తున్నారని, ఇదే సమయంలో తాము విద్యుత్ కార్యాలయాన్ని సంప్రదిస్తే ఎవరూ స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పడాల రమణ మాట్లాడుతూ ప్రస్తుత వేసవి సీజన్‌లో ఒకవైపు ఎండలు మండుతుంటే, ఈ విపరీతపు కరెంట్ కోతలేమిటని ప్రశ్నించారు. కోతలు లేకుండా విద్యుత్ సరఫరాను క్రమబద్ధీకరించాలని కోరారు. బిజెపి కిసాన్ మోర్చా అధ్యక్షుడు పివివి పట్నాయక్ మాట్లాడుతూ, విద్యుత్ సరఫరాను క్రమబద్ధీకరించకుంటే ఆందోళన తప్పదని హెచ్చరించారు.

ఏజెన్సీకి మైదాన ప్రాంత ఉపాధ్యాయుల బదిలీ సరికాదు!

ప్రజాశక్తి-ఉక్కునగరం : సుప్రీం కోర్టులో జిఒ3పై రివ్యూ పిటిషన్ పెండింగ్‌లో ఉండగా, విద్యాశాఖ అధికారులు మైదాన ప్రాంత ఉపాధ్యాయులను ఏజెన్సీ ప్రాంతానికి బదిలీ చెయ్యడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆదివాసీ గిరిజన సంఘం ఒక ప్రకటనలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేసింది. ఏజెన్సీలోని నూరు శాతం పోస్టులు గిరిజనులకే రిజర్వేషన్లు అమలు చేసేలా చట్టం చేయాలని డిమాండ్ చేశారు.టిఎసిలో నూరు శాతం రిజర్వేషన్లపై తీర్మానం చేసిన గిరిజన ప్రాంత ఎమ్మెల్యేలు దీనిపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అల్లూరి జిల్లా పాడేరు ఏజెన్సీకి మైదానప్రాంతం నుంచి 400 మంది రెగ్యులర్ టీచర్లను బదిలీ చేశారన్నారు. ఆదివాసీ గిరిజన సంఘం దాఖలు చేసిన పిటిషన్ కోర్టులో పెండింగ్‌లో ఉండగా, రాష్ట్ర ప్రభుత్వం ఏజెన్సీకి మైదానం ప్రాంతం నుండి ఉపాధ్యాయులను బదిలీ చేయడం ఆదివాసీ గిరిజన నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం చేసినట్లేనని ప్రకటనలో పేర్కొన్నారు. గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన షెడ్యూల్ ఏరియా ప్రత్యేక హక్కులను ప్రభుత్వం కాల రాస్తోందని మండిపడ్డారు .ప్రభుత్వం జోక్యం చేసుకుని షెడ్యూల్ ఏరియాలో జిఒ 3 ప్రకారం ప్రభుత్వ ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియ కొనసాగించాలని కోరారు. జిఒ3 రద్దుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలన్నారు. ఏజెన్సీలోని పోస్టులను షెడ్యూల్ నిబంధనలకు వ్యతిరేకంగా, జిఒ 3కు భిన్నంగా గిరిజనేతర ఉపాధ్యాయులతో భర్తీ చెయ్యడాన్ని ఖండిస్తున్నామని 'ఆదివాసీ గిరిజన సంఘం విశాఖ పట్నం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కిముడు చిన్నంనాయుడు, జి.వి .రమణ మూర్తి పేర్కొన్నారు.

విఆర్ఎల సమస్యలపై నిర్లక్ష్యం తగదు

ప్రజాశక్తి -ఆనందపురం : విఆర్ఎల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం చూపడం తగదని విఆర్ఎల సంఘం భీమిలి జోన్ గౌరవాధ్యక్షులు రవ్వ నర్సింగరావు, పోలిపల్లి, అప్పలరాజు, ఎద్దు అప్పారావు ఆవేదన వ్యక్తం చేశారు. విఆర్ఎలకు కనీస వేతనం రూ.26వేలు వేతనం, డిఎ బకాయి చెల్లింపు, విఆర్ఎలకు అర్హతలను బట్టి విఆర్ఒ, అటెండర్, డ్రైవర్, వాచ్‌మ్యాన్ ఇతర ఉద్యోగాలకు ప్రమోషన్ కల్పించాలని కోరారు. మహిళా విఆర్ఒలకు ఆరు నెలల మెటర్నిటీ లీవ్ ఇవ్వాలన్నారు.

హోమియో వైద్యశిబిరం నిర్వహణ

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక చిన బజారులోని కళిగొట్ల స్విర్ల శ్రీదేవి ఫౌండేషన్ కార్యాలయం వద్ద ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని ఫౌండేషన్ చైర్మన్ శ్రీరామచంద్రమూర్తి ప్రారంభించారు, వైద్యులు టి జగన్నాథరావు, టిజె.మోహన్ రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.ఫౌండేషన్ ప్రతినిధులు కెఎస్ఎన్ మూర్తి, కె చంద్రశేఖర్, కెవి భానోజీరావు, కె శ్రీనివాసరావు,పాల్గొన్నారు.

తప్పుడు మెసేజ్‌లను నమ్మొద్దు

ప్రజాశక్తి- సీతమ్మధార : విద్యుత్ బిల్లుల చెల్లింపు విషయమై వినియోగదారుల మొబైల్స్‌కు వస్తున్న అవాస్తవ మెసేజ్‌లను నమ్మవద్దని ఎపిఇపిడిసిఎల్ ఆపరేషన్ సర్కిల్ ఎస్ఇ ఒక ప్రకటనలో తెలిపారు. బిల్లు చెల్లించమని లేదంటే విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, అలాగే బ్యాంక్ ఖాతా లింక్ ఇచ్చి దానికి బిల్లులు చెల్లించాలని, లేకుంటే సరఫరా నిలిపేస్తామని విశాఖలో ఉంటున్న విద్యుత్ వినియోగదారుల మొబైల్స్‌కు రాత్రి వేళల్లో మెసేజ్‌లు వస్తున్నాయని, అవన్నీ అవాస్తవాలన్నారు. విద్యుత్ శాఖ సిబ్బంది సాయంత్రం ఐదు గంటల తర్వాత, ఉదయం 8 గంటలలోపు విద్యుత్ బిల్లుల చెల్లింపులు, ఇతరత్రా ఏ విషయంపైనా వినియోగదారులను సంప్రదించరన్న విషయాన్ని వినియోగదారులు గమనించాలని కోరారు. ఒకవేళ రాత్రి వేళల్లో ఎవరైనా బిల్లు చెల్లించమని అడిగితే సంబంధిత అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

పూర్వ విద్యార్థుల ఔదార్యం

ప్రజాశక్తి -తగరపువలస : చిట్టివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు ఔదార్యాన్ని చాటుకున్నారు. తమతోపాటు చదువుకుని, కష్టాల్లో ఉన్న పూర్వ స్నేహితులకు ఇతోధిక సాయం అందించారు. 1992బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు కొండపేటకు చెందిన తమ సహచరుడు వాడ్ర రామలక్ష్మణ కుటుంబానికి ఆదివారం నిత్యావసర సరుకులు అందజేశారు. అలానే అనారోగ్యం బారిన పడిన కొత్తపేట'ఎ' చెందిన అల్లు గొరికి రూ 5వేలు సాయం చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బడిగంటి మహేష్, గాడి భాస్కర్, ఎస్ శ్రీనివాసవర్మ, హేమ, ఎం సుబ్బారావు, పిట్టా శ్రీను, కె శ్రీను, జి సురేష్ పాల్గొన్నారు

అప్రకటిత విద్యుత్ కోతలపై ఆందోళన

పెదగంట్యాడ సబ్ స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి -గాజువాక :అప్రకటిత విద్యుత్ కోతలు నివారించాలని కోరుతూ, తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం పెదగంట్యాడ సబ్ స్టేషన్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు పులి రమణారెడ్డి మాట్లాడుతూ నెల రోజులుగా వేళాపాళా లేని అనధికార విద్యుత్ కోతలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. అలాగే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల స్థాయి చాలకపోవడంతో లోవోల్టేజీ సమస్య ఉత్పన్నమై గృహోపకరణాలు పాడౌతున్నాయని ఆరోపించారు.దీనిపై అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఏవేవో కుంటిసాకులు చెబుతూ విద్యుత్‌శాఖ అధికారులు తప్పించుకుపోతున్నారన్నారు. దీనిపై వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోకుంటే, యువత, మహిళలు, వినియోగదారులతో పెద్దఎత్తున తరలివచ్చి విద్యుత్ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. విద్యుత్ సమస్యలపై మొక్కుబడి చర్యలు మానేసి, శాశ్వత నివారణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, గోక్యాడ ముత్యాలు, మురళి, ఎళ్లంకి రమణ ఇతర నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జెఇఇ అడ్వాన్స్‌డ్‌లో గిరిజన విద్యార్థుల ప్రతిభ

జి.సంతోష్,

కె.సందీప్

పి.మోహన్

ప్రజాశక్తి- మధురవాడ : జెఇఇ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో గిరిజన విద్యార్థుల ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు శిక్షణ సంస్థ ప్రిన్సిపల్ శివ ప్రసాద్ తెలిపారు. అల్లూరి జిల్లా కలెక్టర్, పాడేరు ఐటిడిఎ పిఒ ఆధ్వర్యంలో మారికవలస గిరిజన సంక్షేమ గురుకుల శిక్షణా సంస్థలో శిక్షణ పొందుతున్న 18 మంది విద్యార్థులు ఈ ఏడాది జెఇఇ అడ్వాన్స్‌డు ప్రవేశపరీక్షకు హాజరుకాగా, వారిలో డుంబ్రిగుడ మండలం పింపలగూడ గ్రామానికి చెందిన సాదారణ వ్యవసాయ కూలీ జి.అర్జున్ కుమారుడైన జి.సంతోష్ ఎస్‌టి కేటగిరీలో 483వ ర్యాంకును కైవసం చేసుకున్నాడు. హుకుంపేట మండలం ముళ్ళుమెట్ట గ్రామానికి చెందిన కె.సన్యాసిరావు అనే రైతు కొడుకు కె.సందీప్ ఎస్‌టి కేటగిరీలో 583వ ర్యాంకును, గూడెం కొత్తవీధి మండలంలోని సిహెచ్ గంగవరం గ్రామానికి చెందిన పి.సోమరా అనే కూలీ కుమారుడైన పి.మోహన్ ఎస్.టి కేటగిరీలో 1625 వ ర్యాంకును సొంతం చేసుకున్నారని తెలిపారు. వీరికి దేశంలోనే ప్రఖ్యాతి గాంచిన ఐఐటిలో సీట్లు పొందేలా ర్యాంకులు సాధించడంపై ప్రిన్సిపల్ శివప్రసాద్ హర్షం వ్యక్తం చేసి, అభినందించారు. వీరికి అల్లూరి కలెక్టర్ సుమిత్‌కుమార్, పాడేరు ఐటిడిఎ పిఒ అభిషేక్ అభినందనలు తెలిపారని ప్రిన్సిపల్ తెలిపారు.

నెహ్రూ పేరు మార్పు చౌకబారు రాజకీయం

ప్రజాశక్తి- మాధవధార : నెహ్రూ మ్యూజియం అండ్ లైబ్రరీ సొసైటీని ప్రైమ్ మినిస్టర్ మ్యూజియంగా మార్చడం ద్వారా బిజెపి చౌకబారు రాజకీయం చేస్తోందని ఎపిసిసి, ఒబిసి విభాగం చైర్మన్ మూల వెంకటరావు మండిపడ్డారు. దేశ తొలిప్రధానిగా 17ఏళ్లపాటు ఆ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించిన జవహర్ లాల్ నెహ్రూ, భారత జాతీయోద్యమంలోనూ ఉన్నారన్నారు. మహాత్మాగాంధీతో ఉన్న సాన్నిహిత్యం ఉన్న నెహ్రూ, నవ భారత రూపశిల్పిగా ఎన్నో సేవలు అందించారన్నారు. 1964లో రోదసిలోకి తొలి రాకెట్ ప్రయోగం, 1969లో తొలి అణురియాక్టర్ ఏర్పాటు, నేటి ఐఐటి, ఎయిమ్స్, ఐఐఎంఎస్, నాగార్జునసాగర్ డ్యాం, బాక్రానంగల్ ప్రాజెక్టు వంటి పంచవర్ష ప్రణాళికా రూపశిల్పిగా నెహ్రూ హయంలో ఏర్పాటయ్యాయన్నారు. అంతటి మహానాయకుడి పేరును మార్పుచేసి, నెహ్రూ మ్యూజియంకు ప్రైమ్‌మినిస్టర్ మ్యూజియంగా పేరు మార్చడం ద్వారా భావితరానికి బిజెపి ఏం సందేశాన్ని ఇస్తోందని ప్రశ్నించారు. కాంగ్రెస్ మూలాలు లేకుండా చేయాలన్న బిజెపి కుట్రలు ఎన్నటికీ సాగవని వెంకటరావు హెచ్చరించారు.

యథేచ్ఛగా గెడ్డలు కబ్జా!

- ఆక్రమణలతో రూపురేఖలు తారుమారు
- కుచించిన వాగులతో ముంపు బెడద
- రాజకీయ అండదండలతో గెడ్డలు మాయం
- అవస్థలు పడుతున్న ప్రజలు
- చోద్యం చూస్తూ పట్టించుకోని అధికారులు

66వ వార్డులో గెడ్డపై అక్రమ నిర్మాణం

ప్రజాశక్తి -గాజువాక : యథేచ్ఛగా గెడ్డలు కబ్జాతో జనం నానా అవస్థలు పడుతున్నారు. దురాక్రమణలతో గెడ్డలు కుచించుకుపోయి, చిన్నపాటి వర్షం కురిసినా సమీప కాలనీలు ముంపుబారిన పడడంతోపాటు జనావాసాల్లోని మురుగునీరు చొచ్చుకుపోయి నానా అవస్థలు పాల్జేస్తోంది. దీనిపై అనేకమార్లు అధికారులకు మొరపెట్టుకున్నా, పత్రికల్లో వార్తలు రావడంతోపాటు వామపక్ష ప్రజాసంఘాలు ఆందోళన చేసినా అధికారులకు చీమకుట్టినట్టయినా లేకపోవడంవిశేషం. ఆక్రమణలు, కబ్జాల వెనుక రాజకీయ నేతల అండదండలు, ప్రోద్బలం ఉండడంతో అటువైపు కన్నెత్తి చూసేందుకు అధికారులకు సాహసించడం లేదనే విమర్శలూ ఉన్నాయి.

గాజువాకలో దురాక్రమణలు, కబ్జాలతో గెడ్డల స్వరూపం పూర్తిగా మారిపోతోంది. ఒకపుడు విశాలంగా ఉన్న గెడ్డలన్నీ ఇపుడు ఆక్రమణలతో నీరసించిపోయాయి. 66వ వార్డు పాత గాజువాక కుంచుమాంబ గుడి నుంచి సీతారాం నగర్ వరకు వంద అడుగుల విశాలమైన గెడ్డ ఉండేది. అప్పట్లో సుధా హోటల్ యాజమాన్యం, లక్ష్మీకాంత్ థియేటర్, శేషుమహల్ థియేటర్, స్వాతి బంగారు షాప్ యజమాని ఇలా గెడ్డను ఆనుకుని వ్యాపార సంస్థలు, భవన నిర్మాణదారులు గెడ్డను పూర్తిగా కబ్జా చేశారు. దీంతో ప్రస్తుతం 20 అడుగుల గెడ్డ కూడా లేని పరిస్థితి ఉంది. దీంతో ఇరుకుగా మారిన గెడ్డతో ఎగువన ఏ కొద్దిపాటి వర్షం కురిసినా, పాత గాజువాక, కొత్త గాజువాక, సీతారాం నగర్, ఇందిరా కాలనీ ఇలా గెడ్డ వెంబడి ఉన్న కాలనీలు, జనావాసాలు ముంపుబారిన పడుతున్నాయి. తాజాగా 66వ వార్డు సీతారాం నగర్ కాలనీలో ఒక వ్యక్తి మిగిలి ఉన్న ఈ 20 అడుగుల గెడ్డను కూడా కబ్జా చేసి అక్రమ నిర్మాణం చేపడుతున్నారు. రెవెన్యూ అధికారులు అండదండలు, మేయర్ బంధువునన్న దర్పంతో గెడ్డపై అక్రమ నిర్మాణం చేస్తున్నా, అటువైపు వెళ్లేందుకు జివిఎంసి, రెవెన్యూ అధికారులు జంకుతున్నారు.

వైసిపి నేత ఆక్రమణకు అడ్డే లేదు...

గెడ్డను కబ్జాచేసి, అధికార వైసిపి నేత దామా సుబ్బారావు గెడ్డ స్థలంలో అక్రమ నిర్మాణం చేపడుతున్నాడని టిడిపి జిల్లా అధ్యక్షుడు,మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆ పార్టీనేతలు ధర్నా చేశారు. అయినా అధికారుల్లో ఇసుమంతైనా చలనం లేదు. అక్రమ నిర్మాణం వద్దకు వెళ్లే సాహసమైనా అధికారులు చేయలేకపోవడంతో నేటికీ యథేచ్ఛగా సాగిపోతోందని విమర్శలున్నాయి.

కూర్మన్నపాలెంలో ఆక్రమణకు గురైన గెడ్డలు, ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు

కూర్మన్నపాలెంలోనూ గెడ్డల కబ్జా

ఇదేజోన్ పరిధిలోని కూర్మన్నపాలెంలోనూ భూముల ధరలు విపరీతంగా పెరగడంతో ప్రభుత్వ భూములు, గెడ్డ పోరంబోకులు అనే తేడా లేకుండా ఎక్కడ ఖాళీజాగా కనిపిస్తే అక్కడపాగా వేసే పనిలో కబ్జాదారులున్నారు. రాజకీయ అందడండలు, అధికారుల లోపాయికారీ ప్రోద్బలం, కొన్ని చోట్ల అడ్డుకట్ట వేసే సాహసం లేకపోవడం వంటి కారణాలతో ప్రభుత్వ భూములు, గెడ్డపోరంబోకులు, చివరకు గెడ్డలకు సైతం కాళ్లు వస్తున్నాయనే విమర్శలున్నాయి.

గాజువాక తహశీల్దార్‌వివరణ

గాజువాకలో గెడ్డల కబ్జాపై తహశీల్దార్ కిరణ్ వివరణ కోరగా, 66వ వార్డు సీతారాముల కాలనీలో అక్రమ నిర్మాణాలపై రెండుసార్లు విఆర్ఒను పంపించి నిలుపుదల చేయించామన్నారు. మరోమారు నోటీసులు జారీ చేసి, అక్రమ నిర్మాణాలను నిలుపుదలకు చర్యలు తీసుకుంటామన్నారు. అక్రమార్కులు స్పందించకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కూర్మన్నపాలెంలో గెడ్డ ఆక్రమణలపై ఎంఆర్ఐని పంపి, నివేదిక తెప్పిస్తామని,దానికి అనుగుణంగా చర్యలు తప్పవని హెచ్చరించారు.

మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన

రక్తదానం చేస్తున్న యువత

ప్రజాశక్తి- సింహాచలం: సింహాచలం ఆర్ఆర్ కల్యాణ మండపంలో ఆదివారం నవయువ సేవా సంఘం ఆధ్వర్యంలో మదర్ బ్లడ్ బ్యాంక్, చత్రపతి బ్లడ్ సెంటర్, విశాఖ బ్లడ్ సెంటర్, అమ్మ బ్లడ్‌బ్యాంక్ సౌజన్యంతో రక్తదాన చైతన్యకర్త వినోద్‌బాబు, డాక్టర్ నాగేశ్వరరావు పర్యవేక్షణలో మహా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 185 మంది దాతలు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన సైంటిస్ట్ శ్రీకాకుళపు కిరణ్‌బాబును నవ యువసేన ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పెతకంశెట్టి గణబాబు ఘనంగా సత్కరించారు. స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేసిన దాతలకు జివిఎంసి ఎనిమిదో జోన్ కమిషనర్ మల్లునాయుడు, వివిధ రాజకీయ పార్టీల నేతలు అభినందించారు. కార్యక్రమంలో బిజెపి నేత రవీంద్ర మేకపాటి, టిడిపి భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు, విశాఖ పార్లమెంటరీ టిడిపి ప్రధాన కార్యదర్శి పాసర్ల ప్రసాద్, 98వ వార్డు కార్పొరేటర్ పివి. నరసింహం, జివిఎంసి కోఆప్షన్ సభ్యులు బెహరా భాస్కరరావు, సింహాచల దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ సభ్యుడు గంట్ల శ్రీనుబాబు, 94వ వార్డు కార్పొరేటర్ బల్ల శ్రీనివాస్, అడవివరం కోఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షులు కర్రి అప్పలస్వామి, 98వ వార్డు టిడిపి అధ్యక్షులు పంచదార శ్రీనివాసరావు, వైసిపి నేత ఎర్రవరం బాబు, కొలుసు ఈశ్వరరావు, పీతల అప్పలరాజు, కర్రిసత్తిబాబు జనసేన నేత మజ్జి సూరిబాబు పాల్గొన్నారు.

జెఇఇ అడ్వాన్స్‌డ్‌లో శశి విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి -తగరపువలస : జెఇఇ అడ్వాన్స్‌లో స్థానిక శశి క్యాంపస్ విద్యార్థులు వివిధ కేటగిరీలలో అత్యుత్తమ ర్యాంకులు సాధించారని శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణు గోపాలకృష్ణ, వైస్ చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కేటగిరీల్లో ఎస్ రామహర్షిణికి ఆలిండియాలో 11 వ ర్యాంకు, ఆర్ సాయినారాయణకు 118 వ ర్యాంకు, కె అభిరామ్‌కు 152వ ర్యాంకు, వివిఎస్ గన్వంత్ 235వ ర్యాంకు, వి రాజ్ కుమార్‌కు 504 వ ర్యాంకు, ఆర్ఎస్ వి కృష్ణకు 751 వ ర్యాంకు, పి సాయిరామ్‌కు 802 వ ర్యాంకు, వి ఆనంద్ భాస్కర్‌కు 866వ ర్యాంకు వచ్చిందన్నారు. అలానే బి కావ్య 991వ ర్యాంకు, ఎంహెచ్‌ఎన్‌డి సతీష్ 1135వ ర్యాంకు, డివివి చైతన్య 1210 వ ర్యాంకు సాధించారన్నారు.

ఓపెన్ కేటగిరీలలో వెయ్యి లోపు ఇద్దరు, ఐదువేలలోపు నలుగురు, 10వేల లోపు 10మంది ర్యాంకులు సాధించారన్నారు. వివిధ కేటగిరీలలో 1000 లోపు తొమ్మిది మంది, ఐదు వేలలోపు ర్యాంకులను 35మంది, 10వేల లోపు 46 మంది ర్యాంకులు సాధించారన్నారు.ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను శశి విద్యా సంస్థల కరస్పాండెంట్ మేకా క్రాంతి సుధ అభినందించారు.

తనూషకు ఉత్తమ నటి అవార్డుపై హర్షం

ఉత్తమ నటి అవార్డు స్వీకరిస్తున్న తనూష

ప్రజాశక్తి- సీతమ్మధార: వికెఆర్ ఎంటర్‌టైన్‌మెంట్స్, 24 ఫ్రేమ్స్ మీడియా సంయుక్త ఆధ్వర్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాల వికెఆర్ ఎంటర్‌టైన్‌మెంట్స్ షార్ట్ ఫిలిమ్స్ అవార్డులలో విశాఖకు చెందిన ఇమంది ఈశ్వరరావు హాస్య క్రియేషన్స్ బ్యానర్‌పై నటించి, దర్శకత్వం వహించిన ప్లాస్టిక్ ప్రేమ లఘు చిత్రంలో నటించిన తనూషకు ఉత్తమ నటి అవార్డుదక్కిందని దర్శకుడు ఈశ్వరరావు తెలిపారు. హైదరాబాదు ప్రసాద్ ల్యాబొరేటరీలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో తెలంగాణ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ అవార్డును అందజేశారన్నారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ, ప్లాస్టిక్ ప్రేమ సినిమాలో నటించిన తనూషకు ఉత్తమ నటి అ్వార్డు రావడంపై హర్షం వ్యక్తం చేశారు. తనూషను అభినందించారు

గిరి ప్రదక్షిణ రూటు పరిశీలన

ప్రజాశక్తి- సింహాచలం: వచ్చేనెల 2న ఆషాడ పౌర్ణమిని పురస్కరించుకొని గిరిప్రదక్షిణ ఏర్పాట్లను అధికారులు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా ఆదివారం గిరి ప్రదక్షణ సాగే ప్రదేశాలను, దేవస్థానం అధికారులు, పోలీసు ఉన్నతాధికారులతోపాటు దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు పరిశీలించారు. దేవస్థానం ఇఇలు శ్రీనివాసరాజు, రాంబాబు, ట్రస్ట్ బోర్డు సభ్యులు రాజేశ్వరి, రామలక్ష్మి తదితరులు ఉన్నారు.

వామపక్ష మేధావులపై దేశద్రోహ కేసులు సరికావు

- తక్షణమే రద్దు చేయాలి
- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి-అనకాపల్లి

వామపక్ష మేధావులపై కేంద్ర బిజెపి, తెలంగాణ ప్రభుత్వం దేశద్రోహ కేసులు పెట్టడం సరికాదని, వెంటనే వాటిని రద్దు చేయాలని స్థానిక కార్మిక కర్షక నిలయంలో ఆదివారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు డిమాండ్ చేశారు. ఇటీవల తెలంగాణలో ఆచార్య హరగోపాల్‌తో సహా 149 మందిపై పెట్టిన ఎఫ్ఐఆర్‌ని బేషరతుగా రద్దు చేయాలని కోరారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.బాలకృష్ణ మాట్లాడుతూ బ్రిటీష్ వలస పాలకులు తెచ్చిన దుర్మార్గపు చట్టాలను ప్రస్తుత బిజెపి పాలకులు అమలు చేయడం వారి నియంతృత్వానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. వ్యవసాయ కూలీ సంఘం జాతీయ కార్యదర్శి పిఎస్ అజయ్ కుమార్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం పౌరులకు ఇచ్చిన మానవ హక్కులను, భావ ప్రకటన స్వేచ్ఛను హరించేందుకు కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో నియంతృత్వ పార్టీలు ఈ చట్టాన్ని దుర్వినియోగ పరుస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ చట్టాన్ని రద్దు చేయాలని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యానించారని గుర్తు చేశారు. ప్రజాస్వామిక హక్కుల కోసం నిలిచే మేధావులు, రచయితలు, కళాకారులపై దుర్మార్గమైన ఉపా చట్టాన్ని ప్రయోగించడాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. అనకాపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షులు సాయి మాట్లడుతూ ప్రజాస్వామ్య హక్కులను హరించే విధంగా రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నంగా బిజెపి పాలకులు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో ప్రముఖ లాయర్లు ఐఆర్ గంగాధర్, కనిశెట్టి సురేష్ బాబు, గంటా సురేష్, చేతివృత్తిదారుల సంఘాల నాయకుడు గంట శ్రీరామ్, ఎన్‌పిఆర్‌డి నాయకులు బి.నూక అప్పారావు, ఎస్ఎఫ్ఐ నాయకులు తరుణ్, సిఐటియు నాయకులు దేవుళ్ళు, రైతు సంఘం నాయకులు కర్రి అప్పారావు మాట్లాడారు. ఈ సమావేశం డిమాండ్లను లా కమిషన్‌కు, భారత రాష్ట్రపతికి విజ్ఞాపనలు పంపించాలని సమావేశం తీర్మానించింది.

రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న పలు సంఘాల నాయకులు



తల్లిదండ్రులు, తాతయ్య, అమ్మమ్మలతో లక్ష్మీ సూర్య

జెఇఇ అడ్వాన్స్‌డ్‌లో లక్ష్మీసూర్యకు ఆలిండియా 53వ ర్యాంకు

ప్రజాశక్తి అచ్యుతాపురం

మండలంలోని హరిపాలెం గ్రామానికి చెందిన కాళ్ల లక్ష్మీసూర్య జెఈఈ అడ్వాన్స్‌లో ఆలిండియా 53వ ర్యాంకు, ఓబిసి కోటాలో 6వ ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా మనవడు లక్ష్మీసూర్యను హరిపాలెం గ్రామానికి చెందిన సరగడం కనుమనాయుడు మంగరత్నం అభినందించారు. సూర్య తల్లిదండ్రులు చిన అప్పలనాయుడు, ఉదయశ్రీలు ఆనందం వ్యక్తం చేశారు. సూర్య సోదరి ఆంధ్రా మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ చదువుతుంది. తాత కనుమనాయుడు ప్రజానాట్య మండలి కళాకారుడు.

క్రికెట్ కిట్లు అందజేస్తున్న వైసిపి నాయకుడు దాడి

క్రీడాకారులకు క్రికెట్ కిట్లు అందజేత

ప్రజాశక్తి- మునగపాక రూరల్

మండలంలోని వెంకటాపురం గ్రామంలో క్రికెట్ క్రీడాకారులకు టోపీలు, టీ షర్ట్స్, క్రికెట్ బ్యాట్లను సర్పంచ్ సుందరపు తాతాజీ చేతుల మీదుగా ఆదివారం పంపిణీ చేశారు. వాటిని వితరణ చేసిన గ్రామస్తులు బుద్ధరాజు మాధవవర్మ, పాల సంఘం అధ్యక్షులు సుందరపు వెంకట కాసులబాబు, కడియం గణేష్‌ను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బి సాయి వజ్రం, యూత్ సభ్యులు, క్రికెట్ టీం సభ్యులు పాల్గొన్నారు.

'దేవాంగ' విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ప్రదానం

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి పట్టణంలోని దేవాంగ సామాజిక తరగతికి చెందిన 10వ తరగతి, ఇంటర్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులకు మెరిట్ పత్రాలు, మెమెంటో, నగదు పురస్కారాలను స్థానిక చౌడేశ్వరి పట్టణ దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యాన ఆదివారం అందజేశారు. స్థానిక దేవాంగ సంక్షేమ సంఘ కల్యాణ మండపం (గొల్లవీధి)లో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం సహాయ కార్యదర్శి బల్లా నాగభూషణం మాట్లడుతూ సంఘం గౌరవ అధ్యక్షులు, ముప్పన సిల్క్స్ అధినేత ముప్పన సుబ్రమణ్యం ఆర్థిక సహాయం అందించడంపై కృతజ్ఞతలు తెలిపారు. మొత్తం 23 మంది విద్యార్థులకు ప్రతిభా అవార్డులు బహూకరించామన్నారు. పదేళ్లగా ఈ ప్రతిభా అవార్డులను అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఉజ్జి సత్యనారాయణ, బూడిద నాగేశ్వరరావు, ఉప్పు సాంబమూర్తి, రెడ్డి వరప్రసాద్, కాలెపు తాతాజీ, బాసిన బాల గురూజీ, మావూరి సూకేష్, వేమన సంతోష్, మావూరి సూర్యనారాయణ, బూడిద జోగారావు, దేవాంగ కుటుంబ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతిభ పురస్కారాలు అందజేసిన దేవాంగ సంఘం ప్రతినిధులు

సత్యనారాయణకు ఎస్‌వియు డాక్టరేట్

ప్రజాశక్తి-సబ్బవరం

వివి.సత్యనారాయణ

విశాఖలోని కంచరపాలెంకు చెందిన పోతురాజు వివి.సత్యనారాయణకు శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం మెకానికల్ ఇంజనీరింగ్‌లో పిహెచ్‌డి డాక్టరేట్ ప్రదానం చేసింది. "బ్లాక్ మార్లిన్ గ్లైడర్ వింగ్ టార్పెడో యొక్క హైడ్రోడైనమిక్ మరియు నిర్మాణ విశ్లేషణ" అనే అంశంపై స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్, మెకానికల్ డిపార్ట్మెంట్ విభాగాధిపతి డాక్టర్ వివేక్ సచన్ పర్యవేక్షణలో పరిశోధన చేసినట్లు సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సత్యనారాయణను తల్లిదండ్రులు, మిత్రులు అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. సత్యనారాయణ కొన్నాళ్లగా అవంతి ఇంజనీరింగ్ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-సబ్బవరం

సబ్బవరం-1 సెక్షన్స్ పరిధిలోని 11కెవి సబ్బవరం ఎంహెచ్‌క్యూ, 11కెవి సబ్బవరం రూరల్ ఫీడర్ల మరమ్మతులు, పిఎంఐ పనుల కారణంగా ఈ నెల 19న సోమవారం ఉదయం 8 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు సబ్బవరం 1 సెక్షన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కశింకోట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్.రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల ఏపీ ఈపిడిసిఎల్ విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పిఎం కిసాన్‌కు ఇకెవైసి తప్పనిసరి

ప్రజాశక్తి-సబ్బవరం

పిఎం కిసాన్ లబ్ధిదారులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి పోతల సత్యనారాయణ అన్నారు. మండలంలోని పైడివాడ గ్రామంలో సర్పంచ్ వడ్డాది అప్పలరాజు అధ్యక్షతన ఆదివారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఎం కిసాన్ పథకం ద్వారా అర్హులైన రైతులందరికీ వారి ఖాతాలలో రూ.2వేలు చొప్పున మూడు విడతల్లో రూ.6వేలు జమ చేయడం జరుగుతుందని తెలిపారు. మండలంలో దాదాపు 10వేల మంది వరకు పీఎం కిసాన్ లబ్ధిదారులు ఉండగా 8500 మంది రైతులు ఈకేవైసీ నమోదు చేయించుకున్నారని, మిగిలిన రైతులు కూడా ఈకేవైసి చేయించుకోవాలని కోరారు. రైతు భరోసా కేంద్రంలో ముఖ ఆధారిత ద్వారా గాని, లబ్ధిదారుల ఫోన్ నెంబర్లకు వచ్చిన ఓటీపీని గ్రామ వ్యవసాయ సహాయకునికి తెలియజేయడం ద్వారా ఈకేవైసి చేయించుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు హరీష్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న సర్పంచ్, వ్యవసాయాధికారి

అంగన్వాడీల సమస్యలపై జులై 10, 11 తేదీల్లో

36 గంటల మహాధర్నాను జయప్రదం చేయండి

ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగశేషు

ప్రజాశక్తి-అనకాపల్లి

అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాల సమస్యలపై జులై 10, 11 తేదీల్లో నిర్వహించనున్న 36 గంటల మహాధర్నాను జయప్రదం చేయాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి మజ్జి నాగశేషు పిలుపునిచ్చారు. స్థానిక దొడ్డి రామునాయుడు భవనంలో ఆదివారం యూనియన్ జిల్లా విస్తృత సమావేశం జిల్లా అధ్యక్షురాలు ఎం.దుర్గారాణి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నాగశేషు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీ పథకాన్ని నిర్వీర్యం చేయాలని చూస్తున్నాయని విమర్శించారు. తెలంగాణ కంటే రూ.వెయ్యి అదనంగా వేతనం ఇస్తామని పాదయాత్రలో వైఎస్.జగన్ ఇచ్చిన హామీ నేటికీ నెరవేర్చలేదన్నారు. మరోవైపు ఆన్లైన్లో యాప్‌ల పేరుతో నిరంతరం వేధింపులకు గురి చేస్తున్నారని, స్థానిక రాజకీయ నాయకులు అంగన్వాడీ వర్కర్లపై కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాజకీయ నాయకులు, సచివాలయం అధికారులు, ఎంపిడిఒలు, రెవెన్యూ అధికారులు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు నిరంతరం తనిఖీల పేరుతో అంగన్వాడీలు చేయాల్సిన పనులను చేయనివ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐసిడిఎస్ విభాగం ఉండగా, వీళ్లందరూ తనిఖీలు చేస్తూ వేధింపులకు గురి చేయడం సరైన పద్ధతి కాదని హితవు పలికారు. తక్షణమే అటువంటి వేధింపులు ఆపాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ అంగన్వాడీలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్, గ్రాట్యుటీ, పెన్షన్ వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. లబ్ధిదారులకు నాణ్యమైన ఆహార సరఫరా చేయాలని, మెనూ ఛార్జీలు పెంచాలని, మినీ అంగన్వాడీ కేంద్రాలను మెయిన్ కేంద్రాలుగా మార్చి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యూనియన్ జిల్లా కోశాధికారి వి.వి.రమణమ్మ, నాయకులు సామ్రాజ్యం, సత్యవేణి కాసులమ్మ, ఉమా, మంగ, రమణి 24 మండలాల నుండి తొమ్మిది ప్రాజెక్టులకు చెందిన యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగశేషు

వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు అప్పగిస్తున్న పాలకులు

- పోరాటాలతోనే అడ్డుకోగలం
- రైతుకూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సింహాద్రి ఝాన్సీ

ప్రజాశక్తి- అనకాపల్లి

వ్యవసాయ రంగాన్ని పూర్తిగా కార్పొరేట్, బహుళ జాతి కంపెనీలకు నేటి పాలకులు అప్పగిస్తున్నారని రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) రాష్ట్ర అధ్యక్షులు సింహాద్రి ఝాన్సీ అన్నారు. పాలకుల దోపిడీ విధానాలపై పోరాడటమే రైతాంగ, పీడిత ప్రజల కర్తవ్యమన్నారు. సంఘం జిల్లా మహాసభ అనకాపల్లి న్యూ కాలనీ రోటరీ కళ్యాణ మండపంలో ఆదివారం జరిగింది. ముందుగా రైల్వే అండర్ బ్రిడ్జి నుండి నెహ్రూ చౌక్ మీదుగా సభా ప్రాంగణం వరకు జిల్లా నలుమూలల నుండి వచ్చిన రైతులు, వ్యవసాయ కూలీలతో ర్యాలీ నిర్వహించారు. సంఘం జిల్లా కార్యదర్శి కోన మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలో ఝాన్సీ మాట్లాడుతూ రైతాంగ ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని, సమస్యలు పరిష్కరిస్తామని పాలకులు చెప్పే మాటలన్నీ బూటకమని తేలిపోయిందన్నారు. 30 ఏళ్లుగా కొనసాగుతున్న రైతాంగ ఆత్మహత్యల తీవ్రత దీనిని స్పష్టం చేస్తుందని తెలిపారు. మూడు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా, మద్దతు ధరల చట్టం సాధన కోసం ఢిల్లీ వీధుల్లో లక్షలాదిమంది రైతులు తీవ్రంగా పోరాటం చేసినా కేంద్ర ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోలేదని, పైగా రైతులపైనే తప్పుడు కేసులు బనాయించారని విమర్శించారు.

సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి దంతులూరి వర్మ మాట్లాడుతూ అనకాపల్లి, ఉత్తరాంధ్ర ప్రాంతమంతా అనేక సాగునీటి వనరులు, జీవగెడ్డలు ఉన్నప్పటికీ కరువు వలసలు తాండవిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక నగారా పక్షపత్రిక ఎడిటర్ ఆడారి అప్పారావు మాట్లాడుతూ పాలకులు రైతాంగ, కార్మిక, పేద ప్రజలను దగా చేస్తున్నారని ఆరోపించారు. జనసాహితి జిల్లా అధ్యక్షులు ఐటిఆర్వి శివాజీ రావు, నవ యువ సమాఖ్య జిల్లా నాయకులు ఎన్.భాస్కర్‌రావు ప్రసంగించారు. ఈ మహాసభలో సంఘం నూతన జిల్లా కమిటీ ఎన్నికైంది. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా ఆడారి అప్పారావు కోన మోహన్‌రావు, 20 మంది కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు.

మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర అధ్యక్షులు సింహాద్రి ఝాన్సీ

వైద్య శిబిరానికి హాజరైన ప్రజలు

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి-అచ్యుతాపురం

శ్రీవిష్ణు హాస్పటల్, సురక్ష హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పూడిమడక గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. ఈ శిబిరంలో 150 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. బిపి, షుగర్, బోన్ మినరల్ డెన్సిటీ, దంత, చర్మ, తల సమస్యలను పరీక్షించారు. ఈ వైద్య శిబిరంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ అడిగర్ల సుధీర్, సందీప్ గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడారు. 40 సంవత్సరాల దాటిన ప్రతి ఒక్కరూ మూడు నెలలకు ఒకసారి చొప్పున బీపీ, షుగర్ తదితర పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమముకి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ సుహాసిని వెంకటరమణ, గ్రామ పెద్దలు హాజరయ్యారు.

యోగాసనాల పోటీలు

ప్రజాశక్తి- అనకాపల్లి : అంతర్జాతీయ యోగాడేను పురస్కరించుకొని అనకాపల్లి యోగా లైఫ్ సెంటర్లో నియోజకవర్గస్థాయి అన్ని వయసుల వారికి ఆదివారం యోగాసనాల పోటీలు నిర్వహించారు. యోగ సెంటర్ వ్యవస్థాపకులు కరణం బాబూరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం జరిగాయి. ప్రముఖ ఎముకల వైద్య నిపుణులు డాక్టర్ డి సింహాచలం నాయుడు, ప్రముఖ యోగా నిపుణులు ఎన్ స్వామియజులు పాల్గొని యోగా ప్రాధాన్యతను వివరించారు. ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలంటే యోగా సరైన మార్గమని సూచించారు. ఈ సందర్భంగా యోగాసనాల్లో గెలుపొందిన వారికి బహుమతుల ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో యోగా శిక్షకులు టి మణికంఠ, కరణం రమాదేవి, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి బూత్ కన్వీనర్ల సమావేశం

ప్రజాశక్తి-మునగపాక రూరల్ : స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం బూత్ కన్వీనర్లు సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఓటరు వెరిఫికేషన్‌పై చర్చించారు. తొలగించిన ఓటర్లను తిరిగి నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దాడి శివ, దాడి ముసలి నాయుడు, విల్లూరి నరసింహ రావు, వెలగా మురళి, భీశెట్టి గోవింద, పూసర్ల సత్యనారాయణ, బొడ్డేడ శ్రీను, పెన్నాడ నర్సింగరావు, సూరిశెట్టి శ్యాము, ప్రసాద్ పాల్గొన్నారు.

'పింఛన్లు తొలగించడమేనా పేదలకిచ్చే కానుక?'

ప్రజాశక్తి- అనకాపల్లి : 3 వేల పేద కుటుంబాల పింఛన్లను తొలగించి మంత్రి గుడివాడ అమర్నాథ్ రోడ్డున పడేశారని, పింఛన్లు తొలగించడమేనా పేదలకు ఇచ్చే కానుకా? అని మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ ప్రశ్నించారు. మంత్రి అమర్నాథ్‌కు ప్యాకేజీలపై ఉన్న శ్రద్ధ పేదల ఇబ్బందులపై లేదని విమర్శించారు. ఈ మేరకు ఆదివారం అనకాపల్లి పట్టణంలోని నెయ్యిల వీధిలో పింఛన్లను తొలగించిన వారితో కలసి పీలా సెల్ఫీ ఛాలెంజ్ విసిరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15రోజుల్లోగా పింఛన్లను పునరుద్ధరించకుంటే మంత్రి అమర్నాథ్ ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. టిడిపి హయాంలో 13వేల నుండి 30వేల పింఛన్లు ఇచ్చామని, ఇప్పుడు వైసిపి ప్రభుత్వం ఒక్క అనకాపల్లి పట్టణంలోనే 950 మంది పేదల పింఛన్లను కక్ష కట్టి తీసివేసిందని ఆరోపించారు. నెలకు 3వేలు పింఛను ఇస్తామని చెప్పి ప్రజలను జగన్ మోహన్ రెడ్డి మోసం చేస్తే ఏకంగా మంత్రి గుడివాడ అమర్నాథ్ పేదల పింఛన్లను తొలగించేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మళ్ళ సురేంద్ర, బిఎస్ఎంకె జోగి నాయుడు, పోలవరపు త్రినాధ్, కొణతాల రత్న కుమారి, శ్రీకాకుళపు గణపతి, శేఖర్, రాము పాల్గొన్నారు.

పింఛను రద్దయిన మహిళలతో కలిసి సెల్ఫీ తీసుకుంటున్న పీలా

'సంక్షేమ పథకాలతో పేదలకు మేలు'

ప్రజాశక్తి-అనకాపల్లి

ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ అన్నారు. అనకాపల్లి పట్టణంలోని సత్యనారాయణపురంలో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి అమర్నాథ్ పాల్గొన్నారు. గడపగడపకు వెళ్లి లబ్ధిదారులకు లబ్ధి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా స్థానికులు సత్యనారాయణపురం రైల్వే బ్రిడ్జి కింద నుంచి రహదారి లేకపోవడం వల్ల వాహనాలు నేరుగా తమ ప్రాంతంలోకి రాలేకపోతున్నాయని, అందువలన అండర్ టెన్నల్ నిర్మించాలని కోరారు. ఈ విషయమై తాను ముఖ్యమంత్రితో చర్చించి చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. పోస్టల్ కాలనీలో డ్రైనేజ్ సమస్యను స్థానికులు అమర్నాథ్ దృష్టికి తీసుకొచ్చారు. ఆయన వెంటనే రూ.5 లక్షలు మంజూరు చేసి, తక్షణమే పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. రూ.20 లక్షలతో నిర్మించిన అంతర్గత సిమెంట్ రోడ్లను మంత్రి అమర్నాథ్ ప్రారంభించారు. మూలపేట ప్రాంతాలకు చెందిన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, తహశీల్దారు గంగాధర్‌రావు, ఎంపీటీసీ జోగు నాగమణి నాగేశ్వరరావు, సర్పంచ్ పలక సత్తిబాబు భాగ్యలక్ష్మి, వైసిపి ఉపాధ్యక్షుడు రావి కిషోర్, వైసిపి ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : మండలంలోని తైపురంలో ఆదివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ప్రభుత్వం సంక్షేమ పథకాలను గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కొలిమల్ల అచ్చంనాయుడు, స్థానిక సర్పంచ్ ముచ్చకర్ల శ్రీను, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

20న చలో విజయవాడను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-అనకాపల్లి

భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 20న జరుగు చలో విజయవాడను జయప్రదం చేయాలని ఏపీ బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) నాయకులు నక్కరాజు కొండలరావు పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని కూండ్రం గ్రామంలో చలో విజయవాడ కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని భవనిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, పెండింగ్ లో ఉన్న క్లైములకు వెంటనే నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కంచిపాటి శ్రీను, జెట్టి తాతబాబు, బలిరెడ్డి రమణ, గొర్లి గోవింద, ఎమ్.రాముడు, సూరి అప్పారావు, రామారావు పాల్గొన్నారు.

కె.కోటపాడు : మండల కేంద్రం కె.కోటపాడు శివాజీ విగ్రహం వద్ద ఆదివారం ఏపీ బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ సమావేశం జరిగింది. ఈ నెల 20 జరగనున్న చలో విజయవాడ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు దుక్క ఈశ్వరరావు మాట్లాడుతూ సంక్షేమ బోర్డులో నేటికీ సుమారు 32 వేల పైచిలుకు క్లైయిములు పెండింగ్లో ఉన్నాయని, దీని వల్ల కార్మికులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మొల్లి నాయుడు, పాత్ర పల్లి సోము నాయుడు, సమ్మంగి రాము,గండి బోయిన అప్పారావు, ఆడారి కష్ణ, తులసిరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన సతీష్‌కు పరామర్శ

ప్రజాశక్తి-కె.కోటపాడు

ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన స్థానిక సీనియర్ పాత్రికేయుడు, చోడవరం ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి నేమాల సతీష్‌ను ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్సు (ఏపీయూడబ్ల్యూజే) జాతీయ, రాష్ట్ర, జిల్లా నాయకులు ఆదివారం పరామర్శించారు. వైద్య ఖర్చుల నిమిత్తం యూనియన్ తరపున ఆర్థిక సహాయం అందజేశారు. శస్త్ర చికిత్స అనంతరం తన స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్న సతీష్‌ను పరామర్శించిన వారిలో ఏపీయూడబ్ల్యూజే నేషనల్ కౌన్సిల్ సభ్యులు ఎస్.రామకోటి, స్టేట్ కౌన్సిల్ సభ్యులు కొప్పాక భాస్కర్, జిల్లా అధ్యక్షుడు సిహెచ్‌బిఎల్.స్వామి జిల్లా సంయుక్త కార్యదర్శి కుబిరెడ్డి రాధాకృష్ణ, స్థానిక పాత్రికేయులు గజ్జి బాలగంగాధర్, నీలి శ్రీను తదితరులు ఉన్నారు.

సతీష్‌ను పరామర్శిస్తున్న పాత్రికేయులు

20 నుంచి జగన్నాథ స్వామి రథయాత్ర

ప్రజాశక్తి-అనకాపల్లి

స్థానిక గవరపాలెం శ్రీజగన్నాథ స్వామి వారి రథయాత్ర మహోత్సవాలు ఈనెల 20 నుంచి 29 వరకు జరుగుతాయని ఆలయ ఈవో కీర్తి ఆదినారాయణ తెలిపారు. ఆలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 19న ఆలయ మండపంలో ప్రధాన అర్చకులు బంకుపల్లి సత్యనారాయణ పర్యవేక్షణలో శ్రీరుక్మిణి సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి వారి కళ్యాణం మహోత్సవం, 20న మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అనంతరం రథయాత్ర ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు. 21 బుధవారం నుండి ప్రతిరోజూ స్వామివారు దశావతారాల అలంకరణతో భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. ప్రతిరోజు స్వామివారికి సుప్రభాత సేవ అర్చన కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 29 ఆఖరి రోజు భారీ అన్న సమారాధన, అనంతరం తిరిగి రథయాత్ర ప్రారంభమవుతుందని చెప్పారు.

నేటి నుంచి దేవీపురంలో గుప్త నవరాత్రులు

ప్రజాశక్తి- సబ్బవరం

మండలంలోని దేవీపురం ఆలయంలో ఈనెల19 నుండి 27 వరకు గుప్త నవరాత్రులు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు కందర్ప ప్రభాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా అనేక కార్యక్రమాలను సిద్ధం చేస్తున్నారు. ప్రతి రోజూ వారాహి అభిషేకం, కుంకుమ పూజ, అష్ట మాతృకా అభిషేకం, యంత్రపూజ, జపంతో పాటు సాయంత్రం హోమం నిర్వహిస్తారని పేర్కొన్నారు. భక్తులకు ఉచిత అన్న దానం ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.

అపార్టుమెంట్‌లో చెలరేగిన మంటలు

- తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి-చోడవరం

చోడవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ వెనుకనున్న ఓ అపార్ట్మెంట్లో ఆదివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. దీంతో ఇంట్లో ఉన్న గృహోపకరణ వస్తువులతో పాటు ఇతర వస్తువులు దగ్ధమయ్యాయి. అపార్ట్మెంట్లో నివాసం ఉంటున్న ఓ మహిళ ఇంటికి తాళం వేసి బయటకు వెళ్ళింది. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఆమె ఇంటి నుంచి మంటలు వ్యాపించి పొగ బయటికి రావడంతో పక్కనున్న ఇళ్ళ వారు గమనించి ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. వెంటనే అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన చేరుకొని మంటలను అదుపు చేశారు. ఇంట్లో నాలుగు గ్యాస్ సిలిండర్లు, ఇంటి పైన సెల్ టవర్, దానికి సంబంధించిన జనరేటర్ ఉన్నాయి. వాటికి మంటలు వ్యాపించి ఉంటే భారీ ప్రమాదం జరిగేది. సకాలంలో స్థానికులు స్పందించడంతో పెను ప్రమాదం తప్పింది.

మున్సిపల్ నూతన పాలకవర్గానికి

సమస్యల స్వాగతం

పాల్‌ఘాట్ వద్ద సంచరిస్తున్న పందులు

సత్య సాయి నగర్ ఆర్చి వద్ద చేరిన నీరు (ఫైల్ పాటో)

ప్రజాశక్తి -నర్సీపట్నంటౌన్: మున్సిపాలిటీలో నూతన పాలకవర్గానికి సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. నర్సీపట్నంలో డ్రైనేజీ, అపారిశుద్యం, పందుల బెడద, కుక్కలతో ఇబ్బందులు, వెలగని వీధి దీపాలు వంటి అనేక సమస్యలు సవాల్‌గానే మారనున్నాయి. ఇప్పటివరకు మునిసిపల్ ఎన్నికల తర్వాత ఏర్పడిన పాలకవర్గానికి ఎన్నిసార్లు సమస్యలు విన్నవించుకున్నప్పటికీ పరిష్కారం మార్గం సుగమం కాలేదు. మున్సిపల్ కమిషనర్ కనకారావు, మాజీ చైర్పర్సన్ ఆదిలక్ష్మికి మధ్య సరైన సఖ్యత లేకపోవడంతో ఎక్కడి సమస్యలు అక్కడ తిష్ట వేశాయి. వైసిపి నాయకుల నిర్ణయం మేరకు నూతన పాలకవర్గం ఏర్పడి బోడపాటి సుబ్బలక్ష్మి చైర్పర్సన్ గానూ, కోనేటి రామకృష్ణ వైస్ చైర్మన్ గాను ఎన్నుకోవడం జరిగింది. మున్సిపల్ వార్డు సమస్యలను సవాల్‌గా తీసుకుని నూతనంగా ఏర్పడిన పాలకవర్గం పరిష్కరిస్తుందని మున్సిపాలిటీ ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ అనేక సమస్యలపై అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని తెలుస్తోంది. వేసవి కాలంలో ప్రజలు అధికంగా వేడికి అల్లాడుతున్న సమయంలో ఏదోక వార్డులో విద్యుత్ సమస్య ఎదురవుతూనే ఉంది. 22వ వార్డు వెంకునాయుడుపేటలో వార్డు కౌన్సిలర్ భర్త వీధిలైట్లు ఆర్పడం వెలిగించడం తన పనిగా మారిందని అధికారులకు విషయాన్ని తెలియజేసినప్పటికీ కనీసం స్పందించలేదన్నారు. ఇలా అనేక వార్డుల్లో సమస్యలు తిష్ట వేసి ఉన్నాయి. ఈ సమస్యలను పరిష్కరించేందుకు నూతన పాలకవర్గం త్వరలో పరిష్కరిస్తారని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

వీధి లైటు స్విచ్‌ను ఆపుతున్న కాలనీ వాసి

నా దృష్టికి వచ్చాయి

ఇప్పటికే కొన్ని సమస్యలు నా దృష్టికి వచ్చాయి. ఈ సమస్యలను పరిష్కరించేందుకు తప్పక కృషి చేస్తాం. ఇంతటి ఉన్నత పదవిని మాకు ఇచ్చిన ఎమ్మెల్యే గణేష్ కు రుణపడి ఉంటాం.అదే నమ్మకంతో ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తాం

కోనేటి రామకృష్ణ
మునిసిపల్ వైస్ చైర్మన్

కాలిన జీడి మామిడి తోటలను పరిశీలిస్తున్న అప్పలరాజు

జీడి మామిడి రైతులకు పరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలో ఎన్.నర్సాపురం గ్రామంలో జీడి మామిడి తోటల్లో మంటలు చెలరేగి జీడి మామిడి చెట్లు దగ్ధమయ్యాయని బాధిత రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం అప్పలరాజు కోరారు. ఆదివారం కాలిపోయిన జీడి మామిడి చెట్లను పరిశీలించారు. బాధిత రైతులు అప్పలరాజు ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ, గ్రామానికి చెందిన 9 మంది జీడి మామిడి రైతులకు చెందిన 4-50 ఎకరాల భూములో జీడి మామిడి తోటల్లో మంటలు చెలరేగి కాలి పోయాయన్నారు. పంట ఫలసాయం చేతికి అందివచ్చే సమయంలో అగ్నికి ఆహుతి కావడంతో పేద రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎం.రాజేష్, నాయకులు ఎం.నానాజీ, ఎం.శ్రీను, బాధిత రైతులు కురందాసు నూకరాజు, మనబాల గంగరాజు, బొడ్డపు అప్పారావు, కురందాసు నాగరాజు, అప్పారావు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి -నర్సీపట్నంటౌన్: స్థానిక వీరాజు టాకీస్ రోడ్డులో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు వీరాజు థియేటర్ రోడ్డు లంబసింగి వనం రెస్టారెంట్ వద్ద ఓ వ్యక్తి భోజనం చేస్తూ వెనుకకు తూగిపడి పక్కనే ఉన్న డ్రైనేజ్ కాలువలోకి పడి చనిపోయాడని స్థానికులు తెలిపారు. 108 సిబ్బంది సదరు వ్యక్తిని పైకి తీసి పరిశీలించగా మృతి చెందాడని నిర్ధారించిన అనంతరం మృతదేహాన్ని ప్రైవేట్ అంబులెన్స్‌లో నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారని టౌన్ సిఐ గొంప గణేష్ తెలిపారు. మృతుని శరీరంపై లేత నీలం రంగు షర్టు, ముదురు నీలం రంగు ప్యాంటు ఉంని ఎడమ చేతి పైన సత్యవతి అని తెలుగులో పచ్చబొట్టు ఉందని తెలిపారు. వివరాలు తెలిసిన వారు నర్సీపట్నం టౌన్ పోలీస్ స్టేషన్‌లో తెలియజేయాలని కోరారు.

ముగిసిన శిక్షణా తరగతులు

ప్రజాశక్తి -కోటవురట్ల: మండల కేంద్రంలో మక్కా మసీదు వద్ద గడిచిన మూడు రోజుల నుండి నిర్వహిస్తున్న వేసవి ధార్మిక శిక్షణ తరగతులు విజయవంతంగా ముగిశాయి. స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండలం నుండి వివిధ గ్రామాలకు చెందిన 13 నుంచి 25 సంవత్సరాల విద్యార్థులకు ఖురాన్ పట్ల అవగాహన కల్పించడంతో పాటు మానవ జీవితంలో పెంపొందించుకోవాల్సిన నైతిక విలువలపై అనకాపల్లి జిల్లా జమాత్ అధ్యక్షులు జనాబ్ సయ్యద్ బోధించారు.ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. జమాత్ అధ్యక్షులు ముక్బుల్ ఇబ్రహీం, సిరాజ్ సహా కోటవురట్ల మక్కా మసీదుకు చెందిన ఖాశీం ,ఇస్మాయిల్, అబ్దుల్లా పాల్గొన్నారు.

గాయకుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: పట్టణంలోని ఫంక్షన్ హాల్‌లో గాయకులు ఆత్మీయ కలయికను ఏర్పాటు చేశారు.స్టార్ మేకర్ యాప్ ద్వారా కలిసిన గాయకులు ఆదివారం నర్సీపట్నంలో రామ్ కుమార్ సంగీత స్వరాలు ఈవెంట్ అనే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. టాలెంట్ ఉండి మరుగున పడుతున్న సింగర్స్‌ను వెలికి తీయాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని సంగీత స్వరాల ఈవెంట్ ఆర్గనైజర్ రామ్ కుమార్ తెలిపారు.ఆయన మాట్లాడుతూ, అందరూ కలిసి ఒకే వేదికపై పాటలు పాడుతూ ఆత్మీయ కలయుక ఏర్పాటు చేయడం ఎంతో ఆనందంగా ఉందని వైజాగ్ బీట్స్ ప్రతినిధి శారద అన్నారు.సింగర్స్ సుమారు 50 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు. డాక్టర్ సతీష్, డాక్టర్ ఎస్ఎన్ రావు తదితరులు పాల్గొన్నారు.

గీతాన్ని ఆలపిస్తున్న కళాకారులు

పోరాటంతోనే రోడ్డుకు అనుమతులు

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్: జనసేన పోరాట ఫలితంగానే గొలుగొండ మండలం ఆరిలోవ అటవీ ప్రాంత రోడ్డు నిర్మాణంకు అనుమతులు ఇచ్చారని ఆ పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీర సూర్యచంద్ర అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఆరిలోవ రోడ్డు నిర్మాణానికి అనుమతుల కోసం జనసేన ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిరవధిక నిరాహారదీక్ష చేయడంతో నిధులు మంజూరు చేశారన్నారు.నాతవరం తాండవ రోడ్డుకు మరమ్మత్తులు ఎమ్మెల్యే చేయించలేక పోయారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ 2వ వార్డు ఇన్చార్జ్ శివ, 13వ వార్డు ఇన్చార్జ్ గూడెపు తాతబాబు, డాక్టర్ నారాయణరావు పాల్గొన్నారు.

జిల్లా మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-గొలుగొండ: నర్సీపట్నం కృష్ణ ప్యాలెస్ వద్ద ఈనెల 23న జరిగే ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బికెఎంయు) జిల్లా ప్రథమ మహాసభ జయప్రదం చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు పిలుపునిచ్చారు. గొలుగొండ మండలం గుండుపాల గ్రామంలో ఆదివారం వ్యవసాయ కార్మిక సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శివలంక కొండలరావు, మాకిరెడ్డి రామునాయుడు మాట్లాడుతూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు వ్యవసాయ కార్మికులకు మాయమాటలు చెప్పి గద్దికెక్కి సమస్యలను గాలికొదిలేశాయన్నారు. నర్సీపట్నం నియోజక వర్గ అధ్యక్ష కార్యదర్శులుగా కిల్లాడ అప్పలనాయుడు, గునూరు సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వెలుగుల అర్జున్‌రావు, సహాయ కార్యదర్శి చొడే శ్రీనివాస్ చౌదరి, సిపిఐ మండల కార్యదర్శులు మేకా భాస్కరరావు, జి.రాధాకృష్ణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రామునాయుడు

ఎంఇఒ బదిలీ

ప్రజాశక్తి-రోలుగుంట: రోలుగుంట ఇన్‌చార్జ్ ఎంఇఒ జి.సాయిశైలజ బదిలీ అయ్యారు. ఆమె నర్సీపట్నం ఎంఇఒగా ఉంటూ రోలుగుంట ఇన్‌చార్జ్ ఎంఇఒగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఆమె పరవాడకు బదిలీ అయ్యారు.

ఎంఇఒ 2 గా జోషి నియామకం

ప్రజాశక్తి- కోటవురట్ల: మండల విద్యాశాఖ అధికారి 2 గా పి.జోషి ఆదివారం విశాఖలో జరిగిన కౌన్సిలింగ్‌లో అధికారులు కోటవురట్ల మండలానికి నియమితులైనట్లు వెల్లడించారు. ఆయన ప్రస్తుతం కే. వెంకటాపురం జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తున్నారు. ఇటీవల కాలంలోనే ఆయన విశాఖపట్నం నుంచి బదిలీపై వెంకటాపురం వచ్చారు. జోషి నియామకం పట్ల మండలంలో పలు ఉపాధ్యాయ సంఘం నాయకులు, ఉపాధ్యాయులు ఆయనకు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

రోడ్డు విస్తరణకు నిధుల మంజూరు

-బాధితులకు భూమి గుర్తింపు -నర్సీపట్నం ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: గొలుగొండ మండలంలో ఆర్లీ అటవీ ప్రాంతంలో రోడ్డు విస్తరణకు నిధులు మంజూరు అయ్యాయని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పేర్కొన్నారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆర్లీ అటవీ ప్రాంతంలో ప్రయాణికులు పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా రోడ్డు విస్తరణ చేపట్టేందుకు 2020లో చర్యలు చేపట్టామన్నారు. అటవీ శాఖ, ఆర్అండ్‌బి అధికారులకు ఈ నివేదికలు పంపామన్నారు. 2021 లో రాష్ట్ర ఫారెస్ట్ అధికారులకు వినతి పత్రాన్ని అందించామని తెలిపారు. రోడ్డు విస్తరణలో బాధితులకు పాకలపాడు 203 సర్వే నవంబరులో 5.25 సెంట్లు భూమిని గుర్తించడం జరిగిందన్నారు. రోడ్డు విస్తరణపై ముఖ్యమంత్రి జగన్ దృష్టికి తీసుకెళ్లగా నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈనెల 22 నుండి విస్తరణ పనులు ప్రారంభించడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల జడ్పిటిసి సుర్ల వెంకటగిరి బాబు, చిటికెల భాస్కర్ నాయుడు, లెక్కల సత్యనారాయణ పాల్గొన్నారు.

చెత్త తరలింపు

ప్రజాశక్తి -రావికమతం: గ్రామంలో పేరుకు పోయిన చెత్తా చెదరాన్ని గ్రీన్ అంబాసిడర్ సహాయంతో డంపింగ్ యార్డ్‌కు తరలించడం జరుగుతుందని కవగుంట సర్పంచ్ దాసరి సూర్యకుమారి వరహాలు అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. ప్రతి ఇంటి వద్ద ఉన్న చెత్తను సేకరించి డంపింగ్ యార్డ్‌కు తరలించడం జరుగుతుందన్నారు. గ్రామంలో పారిశుధ్యం మెరుగు పడినప్పుడే ప్రజలకు ఎటువంటి అంటు రోగాలు ప్రబలకుండా ఉంటాయన్నారు. కేరళ తరహాలో రోడ్డు, వీధుల్లో చెత్త చెదారం లేకుండా చూడటమే ద్యేయమని తెలిపారు.

అభినందిస్తున్న ప్రిన్సిపల్

జెఇఇలో శ్రీ ప్రకాష్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -పాయకరావుపేట: స్థానిక శ్రీ ప్రకాష్ విద్యా నికేతన్ విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్డ్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచి ర్యాంకులు సాధించారని శ్రీ ప్రకాష్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వివిఎస్ బి భానుమూర్తి తెలిపారు. తమ విద్యార్థి ఎన్ సూర్యచరణ్ ఎస్సీ కేటగిరీలో 199వ ర్యాంకు, జనరల్ కేటగిరీలో ఎస్.అశోక్ 2366వ ర్యాంకు, సాధించారని ఆయన తెలిపారు. తమ కళాశాలలో జేఈఈ అడ్వాన్స్డ్ ఇండస్ స్పెషల్ కోచింగ్‌తో విద్యార్థులు ర్యాంకులు సాధించారని ఆయన తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సిహెచ్ వికే నరసింహారావు, విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్ విజయప్రకాష్ అభినందించారు.

జెఇఇ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో

'సుదీక్ష' విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి-ఉక్కునగరం : జెఇఇ -2023 మెయిన్స్ పరీక్ష ఫలితాల్లో కూర్మన్నపాలెం, శాతవాహన నగర్ సుధీక్ష కాలేజీ విద్యార్థులు సత్తా చాటారు. పి. సాయి కౌశిక్ (925), జె మేఘన (3393), సత్యంకుమార్ జహ (3728) ర్యాంకులు సాధించారు. కాలేజీ స్థాపించిన అనతికాలంలోనే విద్యార్థులు మంచి ప్రతిభను కనబరిచి ర్యాంకులు సాధించడంపై కాలేజీ చైర్మన్ ఎన్.అప్పలనాయుడు హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మరింతమంది విద్యార్థులు మంచి ర్యాంకులతో కాలేజీ ప్రతిష్టను ఇనుమడింప జేయాలని కోరారు.

అన్ని శాఖల

ఉద్యోగుల ఐక్యతతో విజయం

అమరావతి జెఎసి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : ప్రభుత్వంలోని అన్ని శాఖల ఉద్యోగులు ఐక్యంగా 92 రోజులపాటు చేసిన ఉద్యమానికి విజయం దక్కిందని, అమరావతి జెఎసి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందన్నారు. జిల్లా కలెక్టరేట్ ఆవరణలోని రెవెన్యూ భవనంలో ఆదివారం అభినందన సభ నిర్వహించారు. ఈ సభలో ఆయన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు 50 డిమాండ్ల పరిష్కారం కోసం అమరావతి జెఎసి ఆధ్వర్యాన మార్చి 9 నుంచి జూన్ 8వ తేదీ వరకు వివిధ రకాలలో ఉద్యమాలు చేసినట్లు తెలిపారు. ఈ సభలో శ్రీకాకుళం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, విశాఖ, అనకాపల్లి జిల్లాలకు చెందిన జెఎసి నాయకులు హాజరుకాగా వారందరినీ అభినందించినట్లు తెలిపారు. ఉద్యమానికి మద్దతు ఇచ్చిన సిఐటియు, ఎఐటియుసి, ఇతర యూనియన్ నేతలకు జెఎసి తరపున కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం తమ ఉద్యోగుల నుంచి తీసుకున్న రూ.6,400 కోట్ల బకాయిలు నల్ల బ్యాడ్జిల ఉద్యమం వల్లనే తిరిగి చేకూరిందన్నారు. 47 డిమాండ్లకు గాను 36 పరిష్కారం అయ్యాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో జెఎసి విశాఖ జిల్లా చైర్మన్ సత్తి నాగేశ్వరరెడ్డి, అధ్యక్షులు త్రినాధరావు, రెవెన్యూ సంఘం నాయకులు వివివి సత్యనారాయణ, సిహెచ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

100 అడుగుల రోడ్డు విస్తరణతో నష్టం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: నర్సీపట్నం అభివద్ధి జరగడం తమకు ఆనందదాయకమని, కానీ 100అడుగుల రోడ్డు విస్తరణతో ఎన్నో కుటుంబాలు రోడ్డున పడతాయని బాధితుల సంక్షేమ సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు ఆదివారం స్థానిక రామచంద్ర ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రోడ్డు విస్తరణ బాధితుల సంక్షేమ సంఘం భవన యజమానులు మాట్లాడుతూ, రోడ్డు విస్తరణకు తాము వ్యతిరేకం కాదని, 80 అడుగులు రోడ్డు విస్తరణ చేస్తే తమకు అభ్యంతరం లేదన్నారు. పట్టణం అబివృద్ధి చెందడం తమకు ఎంతో ఆనందదాయకమని రోడ్డు విస్తరణ లో నష్టపోయిన వారికి టిడిఆర్ బాండ్లు కాకుండా నష్టపరిహారం చెల్లించడం మంచిదని పేర్కొన్నారు. 100 అడుగుల విస్తరణ చేపట్టినప్పుడు సుమారు 250 కుటుంబాలు నష్టపోతారని, భవిష్యత్తులో తుని రోడ్డు, చింతపల్లి రోడ్డు వంద అడుగుల విస్తరణ చేస్తే అనేకమంది కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. ఇప్పుడు 100 అడుగులు విస్తరణ చేసినప్పుడు భవిష్యత్తులో తుని, చింతపల్లి రోడ్డు చేయాల్సి ఉంటుందన్నారు. అన్ని రోడ్లు 100 అడుగులు విస్తరణ చేస్తే ఎంతమంది నష్టపోతారని, ఈ విషయమై ఒక్కసారి ఆలోచించాలన్నారు. ప్రస్తుతం నష్టపోతున్న వారందరికీ టి.డి.ఆర్ బాండ్లు కాకుండా నష్టపరిహారం చెల్లించాలన్నారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు అంటే తమకు అపారమైన గౌరవమని తెలిపారు. అతిపెద్దవైన అనకాపల్లి, తుని వంటి పట్టణాల్లోనే ఈ రకమైన విస్తరణ లేదని, నర్సీపట్నంలోనే వంద అడుగుల విస్తరణ చేయడానికి ఎందుకు పూనుకుంటున్నారో అర్థం కాలేదని పేర్కొన్నారు.ఎమ్మెల్యే, అధికారులు చర్చలు జరిపి తమకు న్యాయం చేయాలని కోరారు.

మాట్లాడుతున్న సంఘం ప్రతినిధి

మహిళల అభివృద్ధికి పథకాలు

ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేష్

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సంతృప్తికరంగా ముగిసిందని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ అన్నారు. గొలుగొండ మండలంలో ప్రారంభించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. ఆదివారం చివరిగా పాతమల్లంపేట పంచాయతీ ద్వారకానగరంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన ముగింపు సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రతీ గడపకు వెళ్లినప్పుడు మహిళల కళ్లల్లో ఆనందం చూశానని, నవరత్నాల పథకాలపై ఎంతో సంతృప్తికరంగా సమాధానాలు చెప్పారన్నారు. అనంతరం మండల పార్టీ అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ ఆధ్వర్యంలో మండలంలో సర్పంచ్‌లను, ఎంపిటిసిలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ చిటికెల భాస్కర్‌నాయుడు, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఎంపిపి గజ్జలపు మణికుమారి, వైస్ ఎంపిపి సుర్ల ఆదినారాయణ, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు నల్లబెల్లి శ్రీనివాసులు, మండల యూత్ అధ్యక్షుడు రామకృష్ణ నాయుడు, మండల సచివాలయం కన్వీనర్ పానీ శాంతారావు, కోపరేటివ్ సొసైటీ అధ్యక్షులు పెద్దిరాజు, ఏఎంసి అధ్యక్షులు కొల్లు సత్యనారాయణ, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షురాలు లోచల సుజాత, వైయస్సార్ పార్టీ ప్రధాన కార్యదర్శి పత్తి రమణ, మండలంలోని సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, వైసిపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

మాట్లాడుతున్న ఎంఈఓ అప్పారావు..

అణుకులో ఎంఇఒ పర్యటన

ప్రజాశక్తి- కోటవురట్ల: గొట్టువాడ శివారు అణుకు గ్రామాన్ని మండల విద్యాశాఖ అధికారి పి అప్పారావు, ఉపాధ్యాయులు ఆదివారం సందర్శించారు. ఇటీవల గ్రామానికి చెందిన గిరిజనులతో పాటు సిపిఎం నాయకులు ఎంపీడీవో కు వినతి పత్రం ఇచ్చారు. దీనిపై స్పందించి ఆదివారం అధికారులు సుమారు 5 కిలోమీటర్లు కాలినడకన వెళ్లి గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఎంఈఓ అప్పారావు విద్యార్థుల వివరాలను తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో శిథిలావస్థకు చేరుకున్న పాఠశాలలను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక పంపించనున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట ఉపాధ్యాయులు అబ్దుల్లా, నాని, సంతోష్, తదితరులు ఉన్నారు.

సరుకు రవాణాలో

పోర్టు సరికొత్త రికార్డు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : విశాఖపట్నం పోర్టు ట్రస్టు పాత రికార్డులను తిరగరాస్తూ సరుకు రవాణాలో శనివారం సరికొత్త రికార్డును నెలకొల్పింది. విశాఖపట్నం పోర్టు ఆవిర్భవించిన తర్వాత ఒక్క రోజులో అత్యధిక సరుకు రవాణా చేసిన ఘనతను శనివారం సాధించింది. 4,01,875 మెట్రిక్ టన్నుల సరుకును 23 షిప్పుల నుంచి వివిధ బెర్త్‌లు ద్వారా హ్యాండిల్ చేసి గతంలో ఒక్క రోజులో చేసిన అత్యధిక సరుకు రవాణా రికార్డును తిరగరాసింది. ఇంతకు మునుపు 2023 మే 7 న పోర్టులోని వివిధ బెర్త్‌ల ద్వారా 27 షిప్‌లో నుంచి చేసిన 3,78,760 మెట్రిక్ టన్నుల సరుకు రవాణా ఇప్పటి వరకు ఒక్కరోజులో పోర్ట్ చేసిన అత్యధిక సరుకు రవాణాగా రికార్డులలో ఉంది. విశాఖపట్నం పోర్టు నూతన రికార్డులను సాధించటం పట్ల సిబ్బందిని పోర్టు అథారిటీ చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు, పోర్టు ట్రాఫిక్ మేనేజర్ రత్నశేఖర్ ప్రశంసించారు.

విద్యా రంగాన్ని పరిరక్షించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : విద్యారంగాన్ని పరిరక్షించాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహనరావు కోరారు. యుటిఎఫ్ విశాఖ జిల్లా విస్తృత కార్యవర్గ సమావేశం ఆదివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో విశాఖ జిల్లా అధ్యక్షులు దాసరి నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్డి మోహనరావు మాట్లాడుతూ, జిఒ 117ను రద్దు చేయాలని డిమండ్ చేశారు. యుటిఎఫ్ జిల్లా ప్రధనకార్యదర్శి టిఆర్.అంబేద్కర్ మాట్లాడుతూ, సిపిఎస్‌కు ప్రత్యామ్నాయం ఒపిఎస్ మాత్రమే అని, దానికి మాత్రమే ప్రభుత్వం కట్టుబడి ఉండాలని, పాద యాత్రలో ఇచ్చిన హామీ మేరకు ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్‌చేశారు. 2023 బదిలీల్లో మైదానం ప్రాంతంలో పనిచేసి పోస్టులు రద్దు కావడం వల్ల ఏజెన్సీ ప్రాంతంలోకి బదిలీ అయిన మహిళా ఉపాధ్యాయులు వరకైనా మైదానం ప్రాంతంలో బ్లాక్ చేసిన పోస్టులు ఓపెన్ చేసి కేటాయించాలని, సాంకేతిక సమస్యలు, విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది తప్పిదం కారణంగా బదిలీ ఉత్తర్వులు పొందకుండా ఉన్న వారికి ఎన్‌టైటిల్‌మెంట్ పాయింట్లు ఆధారంగా ప్లేసులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ జిల్లా ప్రధానకార్యదర్శి వైఆర్‌కె ప్రసాద్, తడాన అప్పారావు, గౌరవాధ్యక్షులు అనకాపల్లి పైడిరాజు, సహాధ్యక్షులు రామకృష్ణ, కోశాధికారి కె.రాంబాబు, జిల్లా కార్యదర్శులు చుక్క సత్యం, ఉప్పాడ రాము, సామరాజులు, రియాజ్ అహ్మద్, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రెడ్డి మోమనరావు

ఏజెన్సీకి మైదాన ప్రాంత ఉపాధ్యాయుల బదిలీ శోచనీయం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఇటీవల చేపట్టిన బదిలీల్లో మైదాన ప్రాంతం నుంచి ఏజెన్సీకి ఉపాధ్యాయులను బదిలీ చేయడం శోచనీయమని యుటిఎఫ్ అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయ్ అన్నారు. ఏజెన్సీ ప్రాంతానికి బదిలీ అయిన ఉపాధ్యాయుల సమావేశం ఆదివారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా చినబ్బాయ్ మాట్లాడుతూ, కంపల్సరి బదిలీలో మైదాన ప్రాంతం నుంచి ఏజెన్సీకి బదిలీ అయిన ఉపాధ్యాయులలో వందల సంఖ్యలో మహిళలు ఉన్నారని తెలిపారు. వందల కిలోమీటర్ల దూరంగా ఉన్న ఏజెన్సీ ప్రాంతానికి బదిలీ చేయడం తగదన్నారు. విద్యాశాఖా మంత్రి 30 శాతం అదనపు ఖాళీలను చూపిస్తాం అని చెప్పినప్పటికీ మైదాన ప్రాంతంలో ఉన్న చాలా ఖాళీలను అధికారులు బ్లాక్ చేసి ఏజెన్సీ ప్రాంతానికి పంపించారన్నారు. ఇప్పుడు బదిలీ కాబడిన ఉపాధ్యాయుల ఉద్యోగ నియామక ఒప్పందంలో ఏజెన్సీ ప్రాంతాల్లో పనిచేయాలనే నిబంధన లేదని, జిఒ 3ని సుప్రీం కోర్టు కొట్టివేసిన తరువాత నియామకమైన ఉపాధ్యాయులను మాత్రమే ఏజెన్సీలో నియమించాలని ఆయన కోరారు. మైదానంలో పోస్టులను బ్లాక్ చేసి, భర్త / భార్య పనిచేసే ప్రాంతానికి కొన్ని వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న ఏజెన్సీ పాఠశాలల్లో పని చేయమని చెప్పడం మానవత్వం కాదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కొత్త డిఎస్‌సి ప్రకటించి, తద్వారా నియమితులయ్యే ఉపాధ్యాయులను ఏజెన్సీలో నియమించి, ఇప్పుడు ఏజెన్సీలో పనిచేస్తున్న వారిని మైదాన ప్రాంతానికి ట్రాన్స్‌ఫర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా యుటిఎఫ్ అధ్యక్షులు వి.శ్రీలక్ష్మి, విశాఖ జిల్లా గౌరవాధ్యక్షులు ఎ.పైడిరాజు, జిల్లా కార్యదర్శులు సామరాజు, జిఎస్.ప్రకాష్, మండల నాయకులు బిఎన్.రవి, అప్పల శ్రీను, గోవింద్, ఏజెన్సీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.